01ATP09.qxd:01ATP09.qxd 10/07/26 11:21 PM Page 1



ఉద్భవలక్ష్మి ఆలయంలో తనిఖీలు నిర్వహిస్తున్న సీసీఎస్ సీఐ జైపాల్‌రెడ్డి, ఉరవకొండ, కూడేరు సీఐలు మహానంది, రాజు, ఎస్ఐ జనార్ధననాయుడు బృందం

## ఉద్భవలక్ష్మి ఆలయంలో కొనసాగిన పోలీసుల తనిఖీలు

-చోరీ నేపథ్యంలో వివిధ అంశాలపై నిశిత పరిశీలన

**ఉరవకొండ, జూలై 9 ప్రభాతవార్త**

మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళంలోని లక్ష్మీనరసింహస్వామి ఉప ఆలయమైన ఉద్భవలక్ష్మి ఆలయంలో గురువారం అనంతపురం సీసీఎస్ సీఐ జైపాల్‌రెడ్డి, ఉరవకొండ, కూడేరు సీఐలు మహానంది, రాజు, ఎస్ఐ జనార్ధననాయుడు బృందం తనిఖీలు నిర్వహించింది. బుధవారం తెల్లవారుజామున ఆలయంలో చోరీ జరిగిన విషయం తెలిసింది. ఈక్రమంలోనే చోరీపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ జిల్లా ఎస్పీ పి.జగదీష్‌ను ఆదేశించారు. ఈక్రమంలో పోలీసు అధికారుల బృందం పెన్నహోబిళం చేరుకొని ఆలయంలో తనిఖీలు నిర్వహించి పలు విషయాలపై ఆరా తీశారు. ఆలయం ఎప్పుడు తెరుస్తారు..ఎప్పుడు మూస్తారు, వాచ్‌మెన్ ఎవరూ అన్న విషయాలపై ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ రేగటి నాగరాజు, కార్యనిర్వహణ అధికారి సాకే రమేష్‌బాబు, అర్చకులతో చర్చించారు. ఉద్భవలక్ష్మి ఆలయంలో జరిగిన తరహాలో చోరీలు మరెక్కడైనా జరిగాయి అన్న విషయాలపై విచారణ మొ దలు పెట్టారు.




# అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

శుక్రవారం 10, జూలై 2026 పేజీలు : 04


# అనంతపురంలో హై టెన్షన్

- టీడీపీ, వైసిపి నేతల చర్యలతో ఉద్రిక్తత
- అక్రమాస్తుల నిరూపణకు డెడ్ లైన్
- మాజీ ఎంపీ గోరంట్ల, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి అరెస్ట్
- పోలీసులకు బిగ్ రిలీఫ్
- జిల్లాలో నెలకొన్న ప్రశాంత వాతావరణం



తన అనుచర వర్గంతో ఎమ్మెస్ రాజు

**అనంతపురం క్రైమ్ జూలై 9 ప్రభాతవార్త**

నువ్వా.. నేనా.. అంటూ టిడిపి, వైసిపి నేతల ఆరోపణలు, ప్రత్యారోపణలతో అనంతపురం జిల్లా రాజకీయం ఒక్కసారిగా హీటెక్కింది. ఎప్పుడు, ఏమి జరుగుతుందోనని నగరమంతా ఉత్కంఠతో అట్టుడికింది. మడకశిర తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, రాప్తాడు వైయస్సార్సీపి మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డిల మధ్య బిగ్ వార్ జరుగుతోంది. ఇందులో భాగంగానే వైసీపీ నేత పై టీడీపీ నేత ఎమ్మెస్ రాజు అక్రమాస్తుల నిరూపణ కోసం గురువారం డెడ్ లైన్ విధించగా ఉదయం నుండి ఉద్రిక్తతకు దారి తీసింది. పూర్తి వివరాల మేరకు సుమారు పక్షం రోజులుగా ఒకరిపై ఒకరు చేసుకున్న ఘాటైన విమర్శలు, ప్రతి విమర్శలతో, పదునైన వ్యాఖ్యానాలు, మాటలు తూటాల్లా పేలాయి. మీడియా సమావేశాలే వేదికగా చేసుకున్న ఇరు పార్టీల నేతల మధ్య సాగిన ఆరోపణలు చివరకు వ్యక్తిగత దూషణల దాకా దారితీసింది.

ఈ నేపథ్యంలో తొలుత కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు తన అనుచరులతో సర్ మీటింగ్ కోసం ప్రత్యేక బస్సుల్లో అనంతపురం నగరానికి వస్తున్నారు. అయితే మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, మాజీ ఎంపీ తలారి రంగయ్య తో వైసిపి నాయకులు కార్యకర్తలు తమ బస్సులను అడ్డగించి తమపై దాడికి ప్రయత్నించారంటూ ఎమ్మెల్యే సురేంద్రబాబు, ఆ పార్టీ శ్రేణులతో కలిసి జిల్లా ఎస్పీ జగదీష్ కు ఫిర్యాదు చేశారు. ఇందుకు కౌంటర్ గా మరిసటి రోజే ప్రకాష్ రెడ్డి పత్రికా సమావేశం నిర్వహించారు. తాను తన వాహనంలో ప్రయాణిస్తుండగా బుక్కరాయసముద్రం సమీపంలో సురేంద్రబాబు తన ఎస్ఆర్ కన్స్ట్రక్షన్ కు సంబంధించిన టిప్పర్ తో తనను హత్య చేసేందుకు పెద్దగా కుట్ర పన్నారని, తన వాహన డ్రైవర్ చాకచక్యంతో కుట్ర నుండి తప్పించుకున్నామని ఘాటుగా ఆరోపించారు. ఎమ్మెస్ రాజు ఎమ్మెల్యే గా గెలుపొందిన వెంటనే అక్రమాస్తులు కూడగట్టారని, అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపణలు చేసారు. ఈ కుట్ర ఐటి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రొద్బలంతోనే ఇదంతా జరిగిందని విమర్శించారు.



ఎందుకు స్పందించిన కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు, మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ లు రీ కౌంటర్ ఇచ్చారు. తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై నిప్పులు కక్కారు. ప్రకాశ్ రెడ్డి హత్యకుట్ర అవాస్తవమని ఖండించారు. యాదృచ్ఛికంగా జరిగిన సంఘటనను రాజకీయం చేయడం, తమపై బురద చల్లడం చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటావని హెచ్చరించారు. అలాగే నారా లోకేష్ విమర్శించడం ప్రకాష్ రెడ్డి స్థాయి కాదన్నారు. వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు. తన అక్రమ ఆస్తుల గురించి గురువారం సాయంత్రంలోగా నిరూపిస్తే కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి పాదాల సాక్షిగా తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానంటూ సవాల్ విసిరారు. ఒకవేళ నీవు నిరూపించలేక పోతే మీ ఇంటిని ముట్టడిస్తామని పరుష పదజాలంతో హెచ్చరించారు. ఈ సవాల్ కు గురువారం డెడ్లైన్ విధించడం, ఆ గడువు నేటితో ముగియడంతో పోలీసులు ఒక్కసారిగా అలర్ట్ అయ్యారు. జిల్లాలో ఈ వ్యవహారంతో శాంతి భద్రతలకు విఘాతం ఏర్పడకుండా జిల్లా ఎస్పీ జగదీష్ ప్రత్యేక ఫోకస్ పెట్టారు. నగరంలోని శ్రీ నగర్ కాలనీలో ఎమ్మెల్యే ఎమ్మెఎస్ రాజు ఇంటి వద్ద, అలాగే ఆ సమీపంలోనే వున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి నివాసం వద్ద పోలీసు అధికారులు సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. కొత్త వ్యక్తులను ఎవరినీ నగరంలోకి



ఎమ్మెస్ రాజు ఇంటి వద్ద ఉద్రిక్త వాతావరణం



అనుమతించలేదు. ప్రత్యేక బ్యారికేడ్లను ఏర్పాటు చేసి కట్టుదిట్టమనే భద్రతా చర్యలు చేపట్టారు. మరోవైపు శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర ప్రాంతం నుండి పెద్ద ఎత్తున టిడిపి శ్రేణులు ఎమ్మెస్ రాజు అనుచరులను పెనుకొండ సమీపంలో జాతీయ రహదారిపై పోలీసులు వాహనాలను ఎక్కడికి అక్కడే అడ్డుకున్నారు. మరోవైపు కొత్త వ్యక్తులను అనంతపురం నగరంలోకి ప్రవేశించకుండా గట్టి నిఘా ఏర్పాటు చేశారు. ఎక్కడివారిని అక్కడే నిలువరించడంతోపాటు రాబోయే ఉపద్రవాన్ని ముందుగానే పసిగట్టి ఫుల్ స్టాప్ పెట్టడంలో పోలీసులు సక్సెస్ అయ్యారు. కాగా మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు నివాస వద్దకు హిందూపురం ఎంపీ బీ కే పార్థసారథి, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి, ఎమ్మెల్యేలు అమిలినేని ప్రభుత్వ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు పల్లె సింధూర రెడ్డి, అమిలినేని సురేంద్రబాబు, ధర్మవరం టీడీపీ ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్, మాజీ ఎమ్మెల్సి గుండుమల తిప్పేస్వామి, టీడీపీ ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్ చౌదరి లు ఎమ్మెస్ రాజు నివాసం వద్దకు వెళ్లి సంఘీభావం తెలిపారు. తొమ్మిది ప్రకాష్ రెడ్డి చర్లపై వారు తీవ్రంగా ఖండించారు. రాజకీయాల్లో ఆరోపణలు ప్రత్యారోపణలు సహజమేనన్నారు. అయితే విలువలతో కూడిన రాజకీయం చేయాలన్నారు. దిగజారుడు మాటలు మాట్లాడకూడదని హితవు పలికారు. నిరాధారణమైన ఆరోపణలు చేయడం సరికాదన్నారు. మరో వైపు పోలీసులు ప్రకాష్ రెడ్డి నివాసంలో తనిఖీలు చేపట్టారు. మారణ ఆయుధాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు ముందుగానే ఏర్పాటు చేసుకున్న రాళ్ల కుప్పలను అక్కడి నుండి తొలగించారు. చట్టాన్ని చేతిలోకి తీసుకొని దాడులకు దిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌ను అరెస్టు చేసిన దృశ్యం



పోలీసులతో వాగ్వాదానికి దిగిన ప్రకాష్ రెడ్డి తండ్రి, వైసీపీ శ్రేణులు



అనంతపురంలోకి రానివ్వకుండా అడ్డుకుంటున్న పోలీసులు

అక్కడే ఉన్న ప్రకాష్ రెడ్డి తండ్రి, కొందరు వైసిపి శ్రేణులు మహిళా నాయకురాళ్లు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో అక్కడ కాసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పెద్ద ఎత్తున వైసీపీ శ్రేణులు అక్కడికి చేరడంతో పరిస్థితిని అదుపు చేయడం కోసం పోలీసులు తోపుదుర్తి ప్రకాష్ రెడ్డిని, అతన్ని కలిసేందుకు వచ్చిన మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ ను అరెస్టు చేశారు. పోలీసు సిబ్బంది ఇద్దరినీ బలవంతంగా పోలీసు జీపులు ఎక్కించి పోలీస్ స్టేషన్ కు తరలించారు. వారిని పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో వైసీపీ శ్రేణులు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ పోలీసులను అడ్డుకోవడంతో గందరగోళ వాతావరణం నెలకొంది. ఉద్రిక్త పరిస్థితుల నడుమ అతి కష్టంపై పోలీసులు వాహనంలో ఎక్కించుకొని స్టేషన్ కు తరలించారు. దీంతో ఉదయం నుండి కొన్ని గంటలపాటు కొనసాగిన ఉత్కంఠకు తెరపడింది. దీంతో పోలీసులు ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం అనంతపురం జిల్లాలో ప్రశాంత వాతావరణ కొనసాగుతోంది.

# పేరుకే ప్రభుత్వ ఉద్యోగం...!

- 11 నెలలుగా జీతాలు లేవు భారంగా మారిన కుటుంబ పోషణ
- ఇది ఎస్సీ కార్పొరేషన్ ఉద్యోగుల పరిస్థితి
- ఏపిఈడబ్ల్యూఐడిసి ఉద్యోగుల పరిస్థితి కూడా అదే తెలిసినా పట్టించుకోని ఉన్నతాధికారులు




**అనంతపురం న్యూటౌన్, జూలై 9 ప్రభాతవార్త**

ప్రభుత్వ ఉద్యోగం. ప్రతినెల జీతం వస్తుంది.. కుటుంబ పోషణకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని ఉద్యోగులు భరోసాతో ఉన్నారు. కానీ గత 11 నెలలుగా ఉద్యోగులకు జీతాలు రాకపోవడంతో కుటుంబ పోషణ కోసం అవస్థలు పడుతున్నారు. ఈ విషయం ఉన్నతాధికారులకు తెలిసినప్పటికీ పట్టించుకోకపోవడం గమనార్హం. అనంతపురం జిల్లా ఎస్సీ కార్పొరేషన్ లో 8 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. అందులో ఐదు మంది ఔట్సోర్సింగ్ ఉద్యోగులు. మరొకరు టైం స్కేల్ ఉద్యోగి. మరో ఇద్దరు రెగ్యులర్ ఉద్యోగులు. ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు గత ఏడాది ఆగస్టు నెల నుండి ఈ ఏడాది జూన్ వరకు 11 నెలలు గా జీతాలు చెల్లించలేదు. టైం స్కేల్ ఉద్యోగికి ఈ ఏడాది జనవరి నుండి జూన్ వరకు ఆరు జీతాలు రాలేదు. ఇద్దరు రెగ్యులర్ ఉద్యోగులకు జూన్ నెల జీతాలు రాలేదు. ఔట్సోర్సింగ్, టైం స్కేల్ ఉద్యోగులకు ఇచ్చేదే అరకొర జీతం. అందులో కూడా సక్రమంగా చెల్లించడం లేదు. గత 11 నెలలుగా జీతాలు చెల్లించడం లేదు. దీంతో పిల్లల స్కూల్ ఫీజులు, ఇంటి అద్దెలు, రోజువారి కోసం నిత్యవసర సరుకులు... ఇలా కుటుంబ పోషణ కోసం అనేక అవస్థలు పడుతున్నారు. ఈ విషయాన్ని ఉద్యోగులు జిల్లాకు మాల, మాదిగ కార్పొరేషన్ చైర్మన్లు వచ్చినప్పుడు వారి దృష్టికి కూడా తీసుకెళ్తున్నారు. అలాగే జిల్లా కలెక్టర్, ఎస్సీ కార్పొరేషన్ జనరల్ మేనేజర్, ఎండి దృష్టికి కూడా తీసుకెళ్లారు. అయినా కూడా నేటికీ వేతనాలు చెల్లించడం లేదు. కుటుంబ పోషణ కోసం అప్పులు చేస్తే.... ఆ అప్పులు కూడా ప్రతినెల పెరుగుతూనే ఉన్నాయి. కానీ సక్రమంగా జీతాలు రావడం లేదు. ఈ విషయం ఉన్నతాధికారులకు తెలిసినప్పటికీ .... తాము ఉద్యోగంలో కొనసాగుదామా? వద్దా? అనే ఆలోచనలో ఉద్యోగులు ఉన్నారు.

**ఏపిఈడబ్ల్యూఐడిసిలో కూడా అదే పరిస్థితి:**

జిల్లా కేంద్రంలో పెన్నార్ భవన్ ఆవరణంలో ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఏపిఈడబ్ల్యూఐడిసి లో దాదాపు 15 మంది ఉద్యోగులు ఔట్సోర్సింగ్ కింద గత కొన్నిఏళ్లుగా పనిచేస్తున్నారు. వీరికి జీతం రూ.22 వేలు చెల్లిస్తున్నారు. రెగ్యులర్ ఉద్యోగులతో పాటు సమానంగా ఉద్యోగం చేస్తున్నారు. వీరికి ఇచ్చేది అరకొర జీతం. అది కూడా ఈ ఏడాది జనవరి నెల నుండి జూన్ వరకు జీతాలు చెల్లించలేదు.




కుటుంబ పోషణ కోసము అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జీతాలు రాలేదనే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ కూడా.... రాష్ట్ర కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులు ప్రతినెల జీతాలు తీసుకుంటున్నారు.కానీ జిల్లాలో పనిచేసే ఉద్యోగులకు మాత్రం ఆరు నెలలుగా జీతాలు చెల్లించడం లేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా అయితే తాము కుటుంబాన్ని ఏ విధంగా పోషించాలో ఉన్నతాధికారులే సమాధానం చెప్పాలని కోరుతున్నారు. కనీసం ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆరు నెలల జీతాలను వెంటనే చెల్లించాలని, ఇకనుండి ప్రతినెల సక్రమంగా జీతాలు చెల్లించాలని ఉద్యోగుల కుటుంబ సభ్యులు కోరుతున్నారు. అయితే దీనిపై ఎస్సీ కార్పొరేషన్, ఏపి పిఈడబ్ల్యూఐడిసి రాష్ట్ర ఉన్నతాధికారులు స్పందిస్తారా? లేదా ?అన్నది వేచి చూడాల్సిందే.

# గుంతకల్లులో దొంగల బీభత్సం..!!

- 25 తులాల బంగారు,50తులాల భారీ చోరీ
- ఇంటికి నిప్పటించడంతో విలువైన డాక్యుమెంట్లు,సర్టిఫికెట్లు దగ్ధం
- రోడ్డున పడేశారంటూ బాధితురాలు కన్నీటి పర్యంతం
- భయాందోళనలో పట్టణ ప్రజలు



దొంగతనం జరిగిన ఇల్లు



ఇంటికి నిప్పంటించడంతో దగ్ధమైన విలువైన సామాగ్రి



కన్నీటి పర్యంతమవుతున్న బాధితురాలు ఉమాదేవి

**గుంతకల్లు,జూలై 9,ప్రభాతవార్త**

గుంతకల్లులో దొంగలు బీభత్సం సృష్టించారు.కసాపురం రోడ్డు ఏబీ ఫంక్షన్ హాల్ సమీపంలో బుధవారం తెల్లవారు ఝామున రైల్వే ఉద్యోగిని ఉమాదేవి ఇంట్లో 25 తులాల బంగారు,50 తులాల వెండి,రూ 25 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు బాధితురాలు పేర్కొంది.ఆనవాళ్లు దొరకకుండా ఇంటికి నిప్పంటించడంతో విలువైన డాక్యుమెంట్లు,సర్టిఫికెట్లు,ఏటీఎం కార్డులు,టీవీ,ఫ్రిజ్ పూర్తిగా దగ్ధమయ్యాయి.ఇంట్లో పొగలు రావడం గమనించిన చుట్టుపక్కల వారు బాధితురాలికి సమాచారం ఇచ్చారు.

గురువారం ఉదయం రూరల్ సీఐ ప్రవీణ్ కుమార్,ఎస్ఐ టీపీ వెంకటస్వామి సంఘటన స్థలానికి చేరుకొని ఇంటిని పరిశీలించారు.డాగ్ స్క్వాడ్ తో పరిసర ప్రాంతాలను కుడా పరిశీలించారు.క్లూస్ టీమ్ ను రప్పించి లోతుగా దర్యాప్తు చేస్తామని వారు పేర్కొన్నారు.రైల్వే డిపార్ట్మెంట్ సిగ్నల్ సెక్షన్ లో పనిచేస్తున్న ఉమాదేవి భర్తకు దూరంగా ఉంటూ ఒంటరిగా జీవిస్తుంది.యధావిధిగా బుధవారం రాత్రి విధులకు బయలుదేరింది.ఇదే అదునుగా భావించిన దొంగలు గురువారం తెల్లవారుఝామున చోరీకి పాల్పడినట్లు ఆనవాళ్లు కనిపిస్తున్నాయి.ఆమె ఇద్దరు కూతుళ్లు మహారాష్ట్రలో డిగ్రీ చదువుతున్నట్లు సమాచారం.అయితే దొంగతనం అనంతరం ఇంటికి నిప్పంటించడం సంచలనంగా మారింది.ఆమెపై వ్యక్తిగత కక్షతోనే ఇలాంటి ఉదంతానికి పాల్పడి ఉంటారని పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.కొత్త టెక్నాలజీ అందుబాటులో ఉన్నా వరుస దొంగతనాలకు పాల్పడుతూ ఆధారాలు దొరకకుండా దొంగలు పోలీసులకు సవాల్ విసురుతున్నారు.



డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేస్తున్న దృశ్యం

**కట్టుబట్టలతో రోడ్డున పడేలా చేశారు: బాధితురాలు కన్నీటి పర్యంతం**

పెళ్ళీడుకొచ్చిన కూతుళ్ల కోసం దాచిన బంగారు,వెండి ఎత్తుకెళ్లి తనను రోడ్డున పడేలా చేశారని బాధితురాలు కన్నీటి పర్యంతమైంది.

ఇంటికి నిప్పు అంటించడంతో వస్తువులు,బట్టలు పూర్తిగా కాలిపోయాయని ఆవేదన వ్యక్తం చేసింది.పోలీసులు న్యాయం చేయాలని వేడుకుంది. భయాందోళనలో పట్టణ ప్రజలు పట్టణంలో వరుస దొంగతనాలు జరుగుతుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.ఊర్లకు వెళ్లడం సంగతి పక్కన పెడితే,ఇంటికి తాళాలు వేసి విధులకు వెళ్లాలంటే భయం వేస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా పోలీసులు రాత్రి సమయాల్లో క్రమం తప్పకుండా నైట్ బీట్లు నిర్వహించి దొంగతనాలు అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.


ప్రపంచ జనాభా దినోత్సవ పోస్టర్లు ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్

ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజును పరామర్శించిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి.

గృహ నిర్మాణ పథకం అమలులో శ్రీ సత్యసాయి జిల్లాకు అగ్రస్థానం

ఉద్భవలక్ష్మి ఆలయంలో శాస్త్రోక్తంగా మహా సంప్రోక్షణ

4 >>

## 32 ఏళ్ల ట్రామా పేషేంట్‌కి అడ్వాన్స్‌డ్ ఆర్టిఫిషియల్ యురేత్రల్ స్పింక్టర్ సర్జరీ

- యశోద హాస్పిటల్స్ యూరాలజీ రోబోటిక్ సర్జరీ సీనియర్ కన్సల్టెంట్, క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ మల్లికార్జున రెడ్డి

అనంతపురం, జులై 9 ప్రభాతవార్త బ్యూరో



డాక్టర్ మల్లికార్జున రెడ్డి

32 ఏళ్ల ట్రామా పేషేంట్‌కి అడ్వాన్స్‌డ్ ఆర్టిఫిషియల్ యురేత్రల్ స్పింక్టర్ సర్జరీ ద్వారా మూత్ర విసర్జనపై నియంత్రణను విజయవంతంగా పునరుద్ధరించామని యశోద హాస్పిటల్స్ యూరాలజీ రోబోటిక్ సర్జరీ సీనియర్ కన్సల్టెంట్, క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ మల్లికార్జున రెడ్డి తెలియజేశారు.

గురువారం ఆయన ప్రభాతవార్తకు తెలియజేస్తూ.. యశోద హాస్పిటల్స్‌లోని యూరాలజీ విభాగం, గాయం కారణంగా స్పింక్టర్ దెబ్బతిని నిరంతరం మూత్రం లీక్ అయ్యే (యూరినరీ ఇన్‌కంటినెన్స్) సమస్యతో బాధపడుతున్న 32 ఏళ్ల పేషేంట్‌కి అడ్వాన్స్‌డ్ ఆర్టిఫిషియల్ యురేత్రల్ స్పింక్టర్ ఇంప్లాంటేషన్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించామని తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, అనంతపురం జిల్లా, బ్రాహ్మణపల్లికి చెందిన పేషేంట్, ప్రమాదం కారణంగా స్పింక్టర్ దెబ్బతినడంతో తీవ్రమైన మూత్రం లీకేజీ, మూత్రాశయంపై నియంత్రణ కోల్పోయి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ పేషేంట్‌కి జనరల్ అనస్థీషియా కింద ఆర్టిఫిషియల్ యురేత్రల్ స్పింక్టర్ ప్లేస్‌మెంట్ శస్త్రచికిత్సను చేశారు. అత్యంత ప్రత్యేకమైన ఈ శస్త్రచికిత్సను సీనియర్ కన్సల్టెంట్ యూరాలజీ రోబోటిక్ సర్జరీ. క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ మల్లికార్జున రెడ్డి ఎన్ నేతృత్వంలో, డాక్టర్ ఉపేంద్ర చౌదరి పి, డాక్టర్ గుత్తికొండ వరుణ్, డాక్టర్ డి.వసంత్‌ల బృందం విజయవంతంగా నిర్వహించింది.

యశోద హాస్పిటల్స్ వైద్య సిబ్బంది మాట్లాడుతూ.. తీవ్రమైన యూరినరీ ఇన్‌కంటినెన్స్‌కు ఆర్టిఫిషియల్ యురేత్రల్ స్పింక్టర్ ఇంప్లాంటేషన్‌ను అత్యుత్తమ చికిత్సగా పరిగణిస్తారు. అధునాతన శస్త్రచికిత్సా నైపుణ్యం, కచ్చితమైన పద్ధతులతో, పేషేంట్లు తమ నియంత్రణను, ఆత్మవిశ్వాసాన్ని తిరిగి పొందడంతో పాటు వారి జీవన ప్రమాణాన్ని గణనీయంగా మెరుగుపరచడంలో మేము సహాయపడగలము అని అన్నారు. ఆర్టిఫిషియల్ యురేత్రల్ స్పింక్టర్ ఇంప్లాంటేషన్ అనేది ప్రమాదం, శస్త్రచికిత్స లేదా నరాల సంబంధిత సమస్యల తర్వాత స్పింక్టర్ పనిచేయకపోవడం వల్ల వచ్చే తీవ్రమైన యూరినరీ ఇన్‌కంటినెన్స్ ఉన్న పేషేంట్ల కోసం రూపొందించబడిన ఒక అధునాతన రీకన్‌స్ట్రక్టివ్ యూరాలజికల్ ప్రక్రియ అని డాక్టర్లు తెలియజేశారు. అనంతరం ఆసుపత్రి తదితర విషయాలపై మీడియాకు తెలియజేశారు.

## ఓటర్ ప్రక్రియ త్వరగతన పూర్తి చేయండి.. : మెట్టు విశ్వనాథరెడ్డి


అధికారులతో మాట్లాడుతున్న మెట్టు విశ్వనాథరెడ్డి

కనేకల్, జూలై 10 ప్రభాతవార్త

రాయదుర్గం నియోజకవర్గ పరిధిలోని కనేకల్ మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ సర్వే కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మెట్టు విశ్వనాథ్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తను తప్పకుండా గుర్తిస్తామని, వారి వెంట ఎల్లప్పుడూ ఉంటూ కలిసి నడుస్తామని హామీ ఇచ్చారు.రాయదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి తనయుడు మెట్టు విశ్వనాథ్ రెడ్డి, మండల కన్వీనర్, టౌన్ కన్వీనర్, బీఎల్ఏలు, మండల నాయకులతో కలిసి పలు బూత్‌లను సందర్శించి సర్వే పురోగతిని సమీక్షించారు. ప్రతి బూత్‌లో ఎంత మేర పని పూర్తయిందో తెలుసుకుని, బీఎల్వోలతో మాట్లాడి అవసరమైన సూచనలు చేశారు.సర్వేలో మరణించిన ఓటర్ల వివరాలు, ఇతర ప్రాంతాలకు వెళ్లిన ఓటర్ల సమాచారం కచ్చితంగా నమోదు చేయాలని, అర్హులైన ఒక్క ఓటరు కూడా నష్టపోకుండా అధికారులు, బీఎల్వోలు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఓటు హక్కు ప్రతి పౌరుడికి అత్యంత విలువైనదని, ఇతర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లకు కూడా అవగాహన కల్పించి వారి వివరాలను సకాలంలో నమోదు చేయాలని కోరారు.సర్వే పూర్తి చేసేందుకు మరో నాలుగు రోజుల మాత్రమే గడువు ఉన్నందున ప్రతి నాయకుడు దీనిని సొంత బాధ్యతగా తీసుకుని బీఎల్వోలకు పూర్తి సహకారం అందించాలని పిలుపునిచ్చారు. ప్రతి ఓటరును కాపాడే బాధ్యత మనందరిపై ఉందని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ బ్రహ్మానందరెడ్డి మాజీ జెడ్పిటిసి నాగిరెడ్డి జిల్లా బీసీ సెల్ విభాగ కార్యదర్శి రచ్చుమర్రి హళ్లి నాగరాజు , టౌన్ కన్వీనర్ శర్మాస్ సబ్ మాజీ నెంబర్ నబి బూత్ అబ్జర్వర్లు, బీఎల్ఏలు, బీఎల్వోలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మటన్ మార్కెట్‌లో దెబ్బతిన్న సిమెంట్ రోడ్డును పునరుద్ధరించిన టీడీపీ నాయకులు


సొంత నిధులతో సీసీ రోడ్డు మరమ్మతు చేయిస్తున్న ఆనందరాజు

కనేకల్ జూలై 10 ప్రభాతవార్త

కనేకల్ పట్టణంలోని 2వ వార్డు మటన్ మార్కెట్ ప్రాంతంలో డ్రైనేజీ సమస్య కారణంగా దెబ్బతిన్న సిమెంట్ రోడ్డుకు తెలుగుదేశం పార్టీ నాయకులు తమ సొంత నిధులతో మరమ్మత్తులు చేపట్టి ప్రజలకు ఊరట కల్పించారు.స్థానికంగా డ్రైనేజీ పైప్‌లైన్ పూర్తిగా బ్లాక్ కావడంతో దానిని తొలగించే క్రమంలో సిమెంట్ రోడ్డును తవ్వి అలాగే వదిలివేశారు. దీంతో దాదాపు రెండు నెలలుగా ఆ మార్గంలో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయి, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్యపై పలుమార్లు పత్రికల్లో కథనాలు ప్రచురితమైనప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపోవడంతో పరిస్థితి అలాగే కొనసాగింది.ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ క్లస్టర్ నాయకుడు ఆనంద్ రాజులు చొరవ తీసుకుని తన సొంత నిధులతో దెబ్బతిన్న సిమెంట్ రోడ్డుకు కాంక్రీట్‌తో మరమ్మత్తులు చేయించి రాకపోకలు పునరుద్ధరించారు. పనులు పూర్తయ్యే వరకు స్వయంగా అక్కడే ఉండి పర్యవేక్షించినట్లు స్థానికులు తెలిపారు.ఈ సందర్భంగా 130వ బూత్ కన్వీనర్ అల్తాఫ్ మాట్లాడుతూ, ప్రజా సమస్యలను పరిష్కరించడంలో టీడీపీ నాయకులు ఎల్లప్పుడూ ముందుంటారని, అధికారుల నిర్లక్ష్యం వల్ల ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలకు ఆనంద్ రాజులు చేసిన సహాయం ఎంతో ఉపయోగపడిందని పేర్కొన్నారు. స్థానికులు కూడా ఆయన సేవాభావాన్ని అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

## మహాసంగ్రామం లో పాల్గొందాం హక్కులు సాధిద్దాం

11న జరగబోవు ఆందోళన కార్యక్రమాలు విజయవంతం చేయండి..... యూనియన్ జిల్లా అధ్యక్షులు నీలం అశోక్ పిలుపు.

గోరంట్ల జులై 10 ప్రభాత వార్త


మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు

నూతన పెన్షన్ విధానానికి (సిపిఎస్) వ్యతిరేకంగా ఏపీసీపీఎస్ఈఏ సంఘం రాష్ట్ర కార్యవర్గం ఆధ్వర్యంలో అనంతపురం, సత్యసాయి ఉమ్మడి జిల్లాల కార్యవర్గాలు కలసి జులై 11 (రెండవ శనివారం) న ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఖిఖిఅనంతసాయి మహాసంగ్రామంఖిఖి కార్యక్రమంలో అన్ని ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న సిపిఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని, వివిధ సంఘాల జిల్లా నాయకులు ఈ కార్యక్రమానికి పద్ధతి పలకాలని సత్యసాయి జిల్లా అధ్యక్షులు నీలం అశోక్, అనంతపురం జిల్లా అధ్యక్షులు పొట్టిపాటి జగదీష్ కుమార్, ప్రధాన కార్యదర్శి మాయకుంట్ల రవికుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్ ఎం కే వరప్రసాద్ లు కోరడమైనది. నాయకులు మాట్లాడుతూ సిపిఎస్ ఉద్యోగులు ఇప్పటికైనా కళ్ళు తెరిచి ఉద్యమించకపోతే ఉద్యోగ జీవితానంతరంసామాజిక పెన్షన్ కంటే తక్కువ పెన్షన్ తీసుకోవడానికి అంగీకారం తెలిపినట్లేనని, దయచేసి ప్రతి ఒక్కరూ ఈ విషయంలో చైతన్యం కావాలన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షులు బాజీ పఠాన్, ప్రధాన కార్యదర్శి కరిమి రాజేశ్వరరావు మరియు పాత పెన్షన్ విధానాన్ని సాధించిన 5 రాష్ట్రాల అధ్యక్షులు కూడా హాజరవుతున్నారని తెలిపారు. ఉద్యమాలకు పుట్టినిల్లు అయిన అనంతపురం నగరం నందు చరిత్రలో నిలిచిపోయే అత్యంత ముఖ్యమైన, సిపిఎస్ ఉద్యోగుల భవిష్యత్తు భరోసా కోసం చేపడుతున్న ఈ కార్యక్రమానికి అనంతపురం మరియు సత్యసాయి జిల్లాల పరిధిలోని ఉద్యోగులందరూ మాత్ర సంఘాలకి అతీతంగా బాధ్యతాయుతంగా (ముఖ్యంగా అనంతపురంలో నివాస ముంటున్న ఉద్యోగులందరూ) తప్పనిసరిగా హాజరుకావాలని, దీనికి సీనియర్ ఉద్యోగులు ఉపాధ్యాయులు మరియు అన్ని సంఘాల ప్రతినిధులు మద్దతు తెలిపి సహకరిస్తారని , అన్ని సంఘాల జిల్లా నాయకులు అందరికీ ఇదే మా ఆహ్వానంగా మన్నించి కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## సర్ ను మ్యాపింగ్ పై ప్రత్యేక దృష్టి పెట్టండి

- టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం

- హాజరైన... మండల అబ్జర్వర్స్ డివి ఆంజనేయులు, మాధవ నాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న మండల కన్వీనర్

గోరంట్ల జులై 10 ప్రభాత వార్త

మండలంలోని గంగంపల్లి పంచాయతీ మీటింగ్ సమావేశం తెలుగుదేశం పార్టీ కార్యాలయం లో సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంలో భాగంగా అబ్జర్వర్ డీవీ ఆంజనేయులు, మాధవనాయుడు కార్యక్రమం గురించి అవగాహన కల్పిస్తూ మ్యాపింగ్ ప్రక్రియ మరియు ప్రతి బూత్ లో ఆ బూత్ కు సంబందించిన నాయకులు, కార్యకర్తలు, యానిమేటర్స్,స్టోర్ డీలర్స్,ఫీల్డ్ అసిస్టెంట్ జులై 14తేదీ వరకు మరింత వేగవంతం చేయాలని సూచించారు..ఈ కార్యక్రమంలో గుత్తాబాలకృష్ణచౌదరి టీడీపి మండల కన్వీనర్,రాష్ట్ర హస్తకళల డైరెక్టర్ సోమశేఖర్, టీడీపిజిల్లాఉపాధ్యక్షులు సుధాకర్ రెడ్డి, టీడీపి జిల్లా కార్యదర్శి నరేష్ కుమార్,పాలసముద్రం సింగల్ విండో అధ్యక్షులు బెల్లలచెరువు చంద్ర,,క్లస్టర్,యూనిట్,బూత్, ఇంచార్జులు,నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సర్ కార్యక్రమాన్ని వేగవంతం చేయండి

డిప్యూటీ తహసిల్దార్ జి. వి. ప్రసాద్

కనగానపల్లి జూలై 9 ప్రభాతవార్త


సర్ కార్యక్రమాన్ని తనిఖీ చేస్తున్న డిప్యూటీ తహసిల్దార్ జీ. వి. ప్రసాద్

మండలంలో సర్ ఓటర్ జాబితాను సక్రమంగా నిర్వహించాలని డిప్యూటీ తహసిల్దార్ జీ. వి. ప్రసాద్ బీఎల్ఓ లను ఆదేశించారు. సర్ కార్యక్రమాన్ని ఆయన గురువారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు 72 శాతం సర్ కార్యక్రమం ను చేపట్టినట్లు తెలిపారు. గడువులోగా 100శాతం సర్ పూర్తి చేయాలని అలాగే ఓటర్ నుండి ఎటువంటి అభ్యంతరాలు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత బి ఎల్ వో ల పై ఉందని అన్నారు. ప్రభుత్వం సూచించిన గడువులోగా 100 పూర్తి చేయాలని ఆయన బిఎల్ఓ లకు సూచించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ మస్తాన్, సిఆర్ఎంటి వరలక్ష్మి, ఎన్ .సుకన్య పిటిఐలు పుష్పలత, భాగ్యలక్ష్మి, శ్రీదేవి, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ పార్టీ శిక్షణా తరగతులు జయప్రదం చేయండి

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెల్లం మహదేవ్

కనగానపల్లి జూలై 9 ప్రభాతవార్త


కరపత్రాలు విడుదల చేస్తున్న సిపిఐ, రైతు సంఘం నాయకులు

ఈనెల 27,28, 29 తేదీలలో లేపాక్షి లో జరిగే సిపిఐ పార్టీ శ్రీ సత్యసాయి జిల్లా రాజకీయ సైదాంతిక శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెల్లం మహదేవ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఓబులేసుని దేవాలయం వద్ద గురువారం బెల్లం మహదేవ్ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణ తరగతులకు మండలం నుండి అత్యధిక మంది హాజరై కార్యక్రమంను జయప్రదం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కన్వీనర్ లింగన్న, మండల కార్యదర్శి బాలరాజు, రైతు సంఘం మండల కార్యదర్శి పసల నాగరాజు,హమాలీ యూనియన్ నాయకులు లక్ష్మీనారాయణ, నరసింహులు, రామాంజనేయులు పాల్గొన్నారు.

## దేశ రక్షణలో విధులు నిర్వహిస్తూ... గోరంట్ల జవాన్ మృతి

గోరంట్ల మండలం దిగువ గంగంపల్లి వాసి రవి చంద్రారెడ్డి

సిఆర్పిఎఫ్ విధులు నిర్వహిస్తూ మృతి

గోరంట్ల జులై 9 ప్రభాత వార్త


మృతి చెందిన జవాన్ రవి చంద్రారెడ్డి

దేశ భద్రత కోసం సిఆర్పిఎఫ్ లో చేరి జమ్ము కాశ్మీర్ సమీపంలోని శ్రీనగర్లో ఎస్పై విధులు నిర్వహిస్తూ గోరంట్ల మండలం ఎగువ గంగంపల్లి పంచాయతీ దిగువ గంగంపల్లి గ్రామానికి చెందిన జవాన్ రవి చంద్రారెడ్డి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. దిగునపల్లి గ్రామానికి చెందిన నంది రెడ్డి, లక్ష్మీదేవమ్మ ల నాలుగో సంతానం రవి చంద్రారెడ్డి. రవి చంద్రారెడ్డి గత 36 ఏళ్ల క్రితం సిఆర్పిఎఫ్ లో చేరాడని గత రెండు రోజుల క్రితం రాత్రి వీధుల్లో ఉండగా మరణించినట్లు తెలుస్తోంది. అయితే ఆయన మరణానికి కారణాలు తెలియాల్సి ఉంది. ఈ సంఘటనతో వారి కుటుంబములతో పాటు గ్రామంలో విషాదఛాయలు అమలు కున్నాయి. శ్రీనగర్లో శవపరీక్షల అనంతరం జవాన్ మృతదేహాన్ని శ్రీనగర్ నుంచి బెంగళూరుకు విమానం ద్వారా అక్కడి నుంచి ప్రత్యేక వాహనంలో వారి స్వగ్రామం అయిన దిగువ గంగంపల్లి లో అంత్య క్రియలు చేపట్టనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

రోడ్డు ప్రమాదమా... హత్య..! మృతుడు మధ్యప్రదేశ్ వాసి

బత్తలపల్లి, జులై 9 ప్రభాత వార్త


మృతి చెందిన అమిత్సేంగ్

మండలంలోని దంపెట్ల క్రాస్ చిత్రావతి నది సమీపంలో మధ్యప్రదేశ్కు చెందిన యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. అది రోడ్డు ప్రమాదమా.. హత్య అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఓబుళాపురం గ్రామం వద్ద కొండలో మైన్సును త్రవ్వుతున్నారు. ఇక్కడ గత ఎనిమిది నెలలుగా మధ్యప్రదేశకు చెందిన ఆమిత్స్ంగ్(22), ముఖేష్సింగ్లతో పాటు మరికొందరు కూలీ పనులు చేసుకుంటున్నారు. అందులో వీరు ఇరువురూ మద్యం సేవించడానికి జాతీయ రహదారిపై నిర్వహిస్తున్న బెల్ట్ దుకాణం వద్దకు చేరుకున్నారు. అమిత్సింగ్ గురువారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడని, స్థానికులు ఆర్డీటి ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. రెండు కిలోమీటర్లు వారు ఇరువురూ నడుచుకుంటూ వచ్చారా? ఏదైనా వాహనంలో వచ్చారా? అనేది అనుమానంగా ఉంది. అయితే ఈ ప్రమాదంపై పోలీసులు అనుమానంతో ముఖేష్సంగ్ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. ఇది రోడ్డు ప్రమాదమా. హత్యా అనేది తెలియాల్సి ఉంది. ఇదిలా ఉండగా మృతునికి వివాహం జరిగి నెల రోజులు అవుతోందని మైన్సు నిర్వహకులు పోలీసుల దృష్టికి తీసుకువచ్చారు. ఆమె మధ్యప్రదేశ్లోనే ఉందన్నారు. వారు ఇక్కడికి రావడానికి రెండు రోజులు సమయం పడుతుందని తెలిసింది. మైన్సు నిర్వాహకులు సైతం నిర్లక్ష్యంగా వ్యవహరించారని చెప్పవచ్చు. వారు ఎక్కడికి వెళ్లారు? ఎప్పుడు వస్తున్నారు? ఏమి చేస్తున్నారు? అనేది కూడా తెలియదని పోలీసుల విచారణలో తేలింది. సీసీ కెమెరాల్లో వారు ఏ సమయంలో వెళ్లింది. వచ్చింది రికార్డు అయింది ఇవ్వాలని పోలీసులు కోరుతున్నారు. జాతీయ రహదారి ప్రక్కనే బెల్టాపులు నిర్వహిస్తుంటే "పోలీసులు, ఎక్సైజ్ అధికారులు సైతం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఈ సంఘటన ద్వారా తెలుస్తోంది.

## జన ఔషధ్ మందులు తక్కువ ధరకే లభిస్తుంది

ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి..


జన ఔషధి కేంద్రంలో మందులను రిబ్బన్ కట్ చేసిన మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర బాలుల హక్కుల మెంబర్ శ్రీనివాసులు

మడకశిర టౌన్ జూలై 9 ప్రభాతవార్త

జన ఔషధి కేంద్రం ను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ నెంబర్ శ్రీనివాస్ మూర్తి లు అన్నారు. మడకశిర పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణంలో జన ఔషధి మందుల కేంద్రం ను మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర బాలుల హక్కుల మెంబర్ శ్రీనివాసు మూర్తిలు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ:అతి తక్కువ ఖర్చుతో నాణ్యమైన మందులు అందుబాటులో తెచ్చేందుకే వీటిని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జన్ ఔషధి రథాలు ప్రజల్లో జన్ ఔషధి కేంద్రాల ప్రయోజనాల గురించి అవగాహన పెంచుతాయి. చౌకైన జనరిక్ మందుల ప్రాధాన్యతను తెలియజేస్తాయి. ఖరీదైన బ్రాండెడ్ మందులకు ప్రత్యామ్నాయాలు అందించాలని, ఆరోగ్య సంరక్షణ ఖర్చులను తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్న ప్రధాన మంత్రి భారతీయ జన్ ఔషధి పరియోజన (పీఎంబీజేపీ)లో భాగంగా ఈ చర్యలు చేపట్టరని అన్నారు.ప్రధాని, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబుల,నాయకత్వంలో రాష్ట్రంలో జన్ ఔషధ మందుల కేంద్రాలను ప్రారంభించారన్నారు. ప్రజలకు 50 నుండి 90 వరకు తక్కువ ధరల్లో జన ఔషధ మందులు లభిస్తాయన్నారు. దాదాపు ప్రజలకు 1,759 వందల అత్యంత నాణ్యమైన ఔషధాలు ప్రజలకు అందుబాటులో ఉంటాయన్నారు. 280 సర్జికల్ పరికరాలు కూడా జన ఔషధ మందుల కేంద్రంలో లభిస్తాయని తెలిపారు. పేద ప్రజలందరూ ఈ జన ఔషధ మందుల కేంద్రంలోని మందులు కొనుగోలు చేయాలని ప్రజలకు వారు సూచించారు. ఈ మందుల షాపులో తక్కువ ధరకే ఔషధాలు ప్రజలకు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ భక్తర్, టిడిపి నాయకుడు రంగే గౌడ్. మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణ. డాక్టర్ ప్రసాద్. గౌరీపురం అంజి. తదితరులు పాల్గొన్నారు.



## సమస్యను చెప్పారు.. ప్రధాన కార్యదర్శి పరిష్కరించారు

అగళి, జులై 9 ప్రభాతవార్త


బోరును మరమ్మత్తు చేయిస్తున్న దృశ్యం

మండల పరిధిలోని ఇరిగేపల్లి, గొల్లహట్టి గ్రామంలో తాగునీటి బోరు చెడిపోయిందని గ్రామస్తులు టిడిపి మండల ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్ యాదవ్‌కు విన్నవించగా సత్వరమే స్పందించిన ప్రధాన కార్యదర్శి, టిడిపి కార్యకర్తలు ప్రకాష్, గిరీష్‌తోపాటు పంచాయితీ కార్యదర్శి బోజరాజు, చొరవ తీసుకుని చెడిపోయిన తాగునీటి బోరును మరమ్మత్తు చేయించి గ్రామస్తులకు నీటిని సరఫరా చేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## గోరంట్ల బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో... ఆ ఇద్దరికీ సన్మానం


సన్మానిస్తున్న పార్టీ నాయకులు

గోరంట్ల జులై 10 ప్రభాత వార్త

భారతీయ జనతా పార్టీ జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శిగా నరసింహులు, కార్యదర్శిగా నగేష్ నియమితులైన సందర్భంగా గోరంట్ల భారతీయ జనతా పార్టీ కార్యాలయం నందు మండల అధ్యక్షులు బోయ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో వారిని ఘనంగా సన్మానించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ పూల గంగాధర్, ప్రధాన కార్యదర్శి భజంత్రీ శంకర, జిల్లా ఉపాధ్యక్షురాలు ముంతాజ్, లక్ష్మిరెడ్డి, మైనార్టీ ఉపాధ్యక్షుడు షబ్బీర్, కొత్తిమీర వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## డేటా ఎంట్రీలో తప్పులు ఉండకూడదు

ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియపై జేసీ తనిఖీ


ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలిస్తున్న జేసి మోర్య భరద్వాజ్

హిందూపురం టౌన్ జూలై 09 ప్రభాతవార్త

ఎస్ఐఆర్ ఓటర్ సర్వే డేటా ఎంట్రీలో ఎలాంటి తప్పులు ఉండకూడదని జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అధికారులను ఆదేశించారు. గురువారం హిందూపురంలో జరుగుతున్న ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియను జాయింట్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఎన్నికల విభాగానికి సంబంధించిన ఈ డిజిటలైజేషన్ ప్రక్రియ అత్యంత కీలకమైనదని, ఇందులో ఎలాంటి చిన్నపాటి పొరపాట్లకు తావు ఉండకుండా స్పష్టంగా డేటా నమోదు చేయాలని అన్నారు. ఉన్నతాధికారులు పూర్తి నాణ్యతతో ఈ ప్రక్రియ ముగించాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న డిజిటలైజేషన్ పనులకు సంబంధిత ఉన్నత అధికారులు నిరంతరం క్షుణ్ణంగా పర్యవేక్షిస్తూ సిబ్బందికి తగిన మార్గదర్శకాలు ఇవ్వాలని ఆదేశించారు. అత్యంత ప్రాధాన్యత కలిగిన ఎన్నికల విధుల్లో ఎక్కడైనా ఎవరైనా అలసత్వం వహిస్తే చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ ఆర్డిఓ ఆనంద్, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, తహసిల్దార్ వెంకటేష్, ఎంపీడీవో దామోదరమ్మ, ఎన్నికల విభాగం సూపర్వైజర్లు కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియ ఓటర్ల ను ఆరా తీస్తున్న జిల్లా రెవెన్యూ అధికారి మలోల



బెళుగుప్ప జూలై 9 ప్రభాత వార్త

కేంద్ర ఎన్నికల కమిషన్ జిల్లా కలెక్టరు సూచనలు మేరకు అనంతపురం జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న సర్ కార్యక్రమం నిర్వహణపై జిల్లా రెవెన్యూ అధికారి మలోల ఆకస్మికగా తనిఖీ చేశారు గురువారం మండల కేంద్రమైన బెళుగుప్ప లో బిఅల్వాలుచేపట్టిన. సర్ ప్రక్రియ సర్వే లో భాగంగా డిప్యూటీ తహసీల్దార్ గురుబ్రహ్మ తో కలిసి ఇన్టిటికీ వెళ్లి ఎన్యూ మరేషన్ పారాల గురించి ఆరా తీశారు ఇన్ట్టిటికీ వెళ్లి ఎన్యూ మరేషన్ పారాలను ఓటరులు తమ వివరాలను భర్తీ చేసి వెంటనే బిఎ లఓలకు అందజేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మలోల మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీలోపు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సర్ నమోదు పారలను డిజిటలైజేసన్ ప్రక్రియ ను పూర్తి చేయాలని ఆదేశించారు . సర్వే ప్రక్రియ లో వేగం పెంచాలని ముఖ్యంగా పొరపాట్ల కు తావివ్వకుండ తప్పు లు లేని ఓటర్ జాబితాను తయారు చేయాలని ఆదేశించారు ఏన్నికల కమీషన్ నిర్దేశించిన 14వతేదీ లోపు బిఎల్ఓ లందరూ తమకు నిర్దేశించిన ఓటరు అందరూ ఏన్యూమరేషన్ పారాల ను డిజిటలై జేసన్. పూర్తీ చేయాలని ఆదేశించారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీనారాయణ మండల విద్యాధికారి గోవిందరాజులు హరికృష్ణ ఏవో సాగర్. సురేఖ మురళీకృష్ణ పెద్ద తిప్పయ్య మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు

## ఎన్యుమరేషన్ పత్రాల పరిశీలన

శింగనమల, జులై 9 ప్రభాతవార్త

సర్ కార్యక్రమంలో భాగంగా బుధవారం నియోజకవర్గ పరిధిలోని గార్లదిన్నె మండల హెడ్ క్వార్టర్స్‌లో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, ఏడిసిసి బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరస నాయుడు ఆదేశాల మేరకు 44, 46, 47, 48 బూతులలో ఎన్యుమరేషన్ పత్రాల స్వీకరణ కార్యక్రమాన్ని నియోజకవర్గ సర్ పరిశీలకులు దేగల కృష్ణ మూర్తి, పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గార్ల దిన్నె మండల పార్టీ కన్వీనర్ పాండుతో కలిసి బిఎల్ఎలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాల సందేహాలను తీరుస్తూ వారితో బిఎల్ఓలు ఫారాలు స్వీకరించేలా చేశారు.

03ATP09.qxd:03ATP09.qxd 10/07/26 11:48 PM Page 1



## పాము కాటుకు గురై చికిత్స పొందుతున్న గిరిజన విద్యార్థిని పరామర్శించిన జివిఎస్ఎస్ నాయకులు



ఆర్థిక సాయం అందజేస్తున్న జివిఎస్ఎస్ నాయకులు

**అనంతపురం న్యూటౌన్, జులై 9 ప్రభాతవార్త**

ఉరవకొండ నియోజకవర్గంలో రాగులపాడు గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న తులసి నాయక్ అనే విద్యార్థికి బుధవారం రాత్రి గురైన విషయం తెలుసుకొని ఆ విద్యార్థిని అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వచ్చారని విషయం తెలుసుకున్న రాష్ట్ర అధ్యక్షులు జివిఎస్ఎస్ గర్మా మల్లికార్జున నాయక్, జిపిఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు హుటాహుటిన ఆసుపత్రికి వెళ్లి తులసి నాయక్‌లు పరామర్శించి డ్యూటీ డాక్టర్‌తో మాట్లాడి విద్యార్థి ఆరోగ్యం వివరాలను పూర్తిగా తెలుసుకొని అనుతరం విద్యార్థి కావలసినటువంటి పండ్లు పలహారంతోపాటు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో జివిఎస్ఎస్ జిల్లా అధ్యక్షులు ధనుంజయ నాయక్, గిరిజన నాయకులు నారాయణస్వామి నాయక్, ఎం. రాకేష్ నాయక్, ప్రసాద్ నాయక్ రాజేష్ నాయక్ బాబు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## దేశాన్ని క్షయవ్యాధి రహితంగా మార్చటమే భారత ప్రభుత్వ లక్ష్యం

- సామాజిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మహేష్



పోర్టబుల్ హెచ్‌హెచ్ ఎక్స్‌రే యంత్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

**పామిడి, జులై 09 ప్రభాతవార్త**

టీబీ ముక్త్ భారత్ అభియాన్ 2.0 అనేది భారతదేశాన్ని క్షయవ్యాధి(టీబీ) రహితంగా మార్చేందుకు భారత ప్రభుత్వం ఒక లక్ష్యంగా చేపట్టిన ముఖ్యమైన జాతీయ కార్యక్రమం అని సామాజిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మహేష్ పేర్కొన్నారు. పట్టణంలోని సీహెచ్‌సీ నందు గురువారం పోర్టబుల్ హెచ్‌హెచ్ ఎక్స్‌రే యంత్రాన్ని ప్రారంభించారు. టీబీ వ్యాధిని ముందస్తుగా గుర్తించేందుకు ఈ ఎక్స్‌రే ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ 2.0 కార్యక్రమంలో బాగంగా పోర్టబుల్ హెచ్‌హెచ్ ఎక్స్‌రే యంత్రంతో హైరిస్క్ జోన్ ఉన్నటువంటి వారికి ఎక్స్‌రే తీశారు. ఈకార్యక్రమంలో అభివృద్ధి కమిటీ సభ్యులు చిలకల రాజ్‌గోపాల్, డాక్టర్ శివకార్తీక్‌రెడ్డి, ఎద్దులపల్లి పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుధాకర్, డాక్టర్ ఉదయార్క్, సూపర్‌వైజర్ శ్రీరామ్‌రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ బాబూజీ నాయక్, రవికుమార్, టీబీ సూపర్‌వైజర్లు సునీర్‌బాషా, జాఫర్‌బాషా, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నూతన సిఐ రాగిరి రామయ్యను కలిసిన టిడిపి నాయకులు




సిఐ రాగిరి రామయ్యను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

**శింగనమల, జులై 9 ప్రభాతవార్త**

శింగనమల సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన నూతన సిఐ రాగిరి రామయ్యను టిడిపి మండల కన్వీనర్ గోరంట్ల మారుతినాయుడు మాజీ మండల కన్వీనర్ చితంబర దొర, మాజీ మార్కెట్‌యార్డు డైరెక్టర్ మాసుల్ చంద్రమోహన్, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు బిసి నాగేంద్ర, పెరవలి మాజీ సర్పంచు రాజు, జడేజా తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా దోణ రామేశ్వర స్వామి నూతన విగ్రహ ప్రతిష్ట



పూజా కార్యక్రమంలో భక్తులు

**శింగనమల, జులై 9 ప్రభాతవార్త**

మండల పరిధిలోని చిన్న జలాలపురం గ్రామంలో గురువారం అంగరంగ వైభవంగా దోణ రామేశ్వరస్వామి నూతన విగ్రహ ప్రతిష్ట నిర్వహించారు. ఈ కార్యక్రమం మంగళవారం నుంచి గురువారం వరకు ఆలయ నిర్మాణ దాత శింగనమల శంకర్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు సుబ్బరంగయ్య స్వామి, వేద పండితుల ఆధ్వర్యంలో గణపతి విగ్రహం, ధనాంబిక అమ్మవారు, సింహవాహనం, బలిపీటం, నవగ్రహాలు, వల్లి దేవసేన, సుబ్రహ్మణ్వేశ్వర స్వామి, జంట నాగులు, సూర్య నారాయణ మూర్తి, మహా విష్ణువు విగ్రహాలు ఘనంగా ప్రతిష్టించారు. ఈ విగ్రహ ప్రతిష్టలకు మండల పరిధి భక్తాదులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. అనంతరం శివపార్వతుల కళ్యాణం, రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. వచ్చిన భక్తాదులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## వార్డెన్‌పై దాడిని ఖండిస్తున్నాం

### ఎస్సీ హాస్టల్స్ వార్డ్ అన్న సంఘం నేతలు

**అనంతపురం న్యూటౌన్, జూలై 9 ప్రభాతవార్త**

ఉరవకొండలో ప్రభుత్వ బాలుర వసతి గృహ వార్డెన్ బి.ఎస్.మహబూబ్ శరీఫ్ విధి నిర్వహణలో ఉండగా వసతి గృహ విద్యార్థి దాడి చేయడం అత్యంత దురదృష్టకరమైనది, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎస్సీ హాస్టల్స్ వార్డ్ అన్న సంఘం జిల్లా అధ్యక్షులు సి.నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి సురాంజినేయులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు సేవలందించే సమయంలో వారిపై దాడులకు పాల్పడడం చట్టవిరుద్ధమేనన్నారు. ఇలాంటి దాడుల వలన సమాజానికి తప్పు సంకేతాలను పంపుతుందన్నారు. ఈ ఘటనలో బాధ్యులైన వారిపై చట్టప్రకారంగా చర్యలు తీసుకొని, భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్, జిల్లా పోలీసు ఎస్పీలను కోరుతున్నాము.

అదేవిధంగా జిల్లాలోని అన్ని హాస్టల్ వార్డెన్లు, సిబ్బంది విధి నిర్వహణలో ఎలాంటి భయాందోళనలు లేకుండా పనిచేసేలా తగిన భద్రతా చర్యలు కల్పించాలని కూడా విజ్ఞప్తి చేస్తున్నాము. ప్రభుత్వ ఉద్యోగులపై దాడులు ఏ రూపంలోనూ సమర్థనీయం కావు అన్నారు. చట్టాన్ని గౌరవిస్తూ, ప్రభుత్వ సిబ్బందికి రక్షణ కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు.

## కదిరి నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చి దిద్దుతా

- ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్



డివైడర్ల మధ్యలో మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్

**కదిరి, జులై 9 ప్రభాతవార్త**

కదిరి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చి దిద్దుతానని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. గురువారం కదిరి పట్టణంలో సుందరీకరణ కార్యక్రమంలో భాగంగా హేమారెడ్డి సర్కిల్ నుంచి బై పాస్ రోడ్డు వరకు డివైడర్ల మధ్యలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పిచ్చి మొక్కల స్థానంలో పూల మొక్కలను నాటారు. డివైడర్లతోపాటు ముస్లిం మైనార్టీల ఈద్గా కబ్రస్తన్ ప్రాంగణంలో కూడా విరివిగా మొక్కలు నాటాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అజయ్‌కుమార , వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతిపై వెళ్తున్న ప్రతాప్‌కు ఆత్మీయ సన్మానం



ప్రతాప్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**శింగనమల, జులై 9 ప్రభాతవార్త**

మండలకేంద్రంలో ఎంపిడిఓ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ పదోన్నతిలో భాగంగా పంచాయితీ రాజ్ సబ్ డివిజన్ ప్రాజెక్టు సీనియర్ అసిస్టెంట్‌గా సత్యసాయిజిల్లా పెనుకొండకు వెళ్తున్న ప్రతాప్‌కు గురువారం ఎంపిడిఓ భాస్కర్ ఆధ్వర్యంలో ఆ కార్యాలయం సిబ్బంది ఆత్మీయ సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారి నాగభూషణరెడ్డి, డిప్యూటీ ఎంపిడిఓ అక్బర్, ఏపిఓ భాగ్యలక్ష్మి, ఈసీ దామోదర్, పంచాయితీ కార్యదర్శిలు, ఉపాధిహామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## అనుమతులు లేకుండా ఎర్రమట్టి తరలింపు



అక్రమంగా మట్టిని తరలిస్తున్న దృశ్యం

**శింగనమల, జులై 9 ప్రభాతవార్త**

మండల పరిధిలోని గుమ్మేపల్లి గ్రామంలో ప్రభుత్వ అనుమతి లేకుండా కొందరు వ్యక్తులు అక్రమంగా ఎర్రమట్టి తరలిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. గత రెండు రోజుల నుంచి పెద్ద ఎత్తున జెసిబిలతో కొండను తవ్వుతు ట్రాక్టర్ల ద్వారా ఎర్రమట్టిని తరలిస్తున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ముదిగుబ్బలో అన్ని ఎక్స్‌ప్రెస్ రైలు నిలపాలి

### డిఆర్‌ఎమ్ కు వినతి పత్రం అందజేసిన బిజెపినాయకులు



టిఆర్ఎం గుప్తాకు వినపత్రం అందజేస్తున్న బిజెపి నాయకులు

**ముదిగుబ్బ జులై 9 ప్రభాతవార్త.**

ముదిగుబ్బ రైల్వే స్టేషన్లో అన్ని ఎక్స్‌ప్రెస్ రైలను నిలుపుదల కల్పించాలని కోరుతూ శ్రీ సత్యసాయి జిల్లా బిజెపి కిషన్ మోర్చా అధ్యక్షులు సోమల ప్రకాష్ ఆధ్వర్యంలో గురువారం డివిజనల్ రైల్వే మేనేజర్ గుప్తాకు బిజెపి నాయకులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముదిగుబ్బ మండలంలో సుమారు 65,000 మంది జనాభా ఉండడంతో రైల్వే స్టేషన్ కు నిత్యం అధిక సంఖ్యలో ప్రయాణికులు వస్తుంటారని తెలిపారు. ఇక్కడ నుండి హైదరాబాద్ తిరుపతి . చెన్నై. అరుణాచలం తదితర సుదూర ప్రాంతాలకు ప్రజలు ఈమార్గంలోప్రయాణిస్తుంటారని పేర్కొన్నారు. ప్రస్తుతం నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్మాత్రమే ఇక్కడ ఆగుతుండగా మిగిలిన ఎక్స్‌ప్రెస్ రైలు పోవడంతో ప్రయాణికులు తీవ్రఇబ్బందులుఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ మార్గంలో నడిచే పినాకిని. శబరి. అంకోలా తదితర ఎక్స్‌ప్రెస్ రైళ్లకు కూడా ముదిగుబ్బలో నిలుపుదల కల్పించాలని డిఆర్ఎం ను కోరారు గతంలో పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు అందజేసిన ఫలితం లేకపోయిందని ఈసారి ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. పులి వెందుల కొత్తచెరువు బుక్కపట్నం తాడిమర్రి తదితర మండలాల ప్రజలు కూడా ఇక్కడ నుండే రైళ్లలో ప్రయాణిస్తూ ఉంటారని తెలిపారు ఇప్పటికైనా అధికారులు జనాభాను దృష్టిలో ఉంచుకొని ముదిగుబ్బ మార్గంలో వెళ్లే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు నిలిపే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు

## మండల వ్యవసాయ అధికారి సోము శేఖర్

**గార్లదిన్నె, జులై 09,ప్రభాత వార్త**

ఖరీఫ్2026 సీజన్‌కు సంబంధించి అమలులో ఉన్న ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్బివైయ్ ), వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం (ఆర్డబ్ల్యూబిసిఐఎస్ )లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కోరారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం జరిగినప్పుడు రైతులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ఈ పథకాలు ఉపయోగపడతాయని తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి జూన్ 15 వరకు పంట రుణాలు పొందిన రైతులు బీమా పరిధిలోకి వస్తారని, రుణం పొందని రైతులు స్వచ్ఛందంగా నమోదు చేసుకోవచ్చన్నారు. పీఎంఎఫ్బివైయ్ కింద ఈ నెల 15వ తేదీలోపు, ఆర్డబ్ల్యూబిసిఐఎస్ కింద ఈ నెల 31వ తేదీలోపు ప్రీమియం చెల్లించి నమోదు చేసుకోవాలని సూచించారు. అర్హులైన రైతులు ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు, భూ పత్రాలతో సమీప బ్యాంకులు లేదా మీ సేవా కేంద్రాల్లో నమోదు పూర్తి చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి తెలిపారు.

## ఆకస్మికంగా ఓటర్ సాధారణము తనిఖీ చేసిన తాసిల్దార్

**అగళి, జూలై 9 ప్రభాతవార్త**

మండల వ్యాప్తంగా ఓటర్ జాబితాల సవరణ కార్యక్రమం జరుగుతోంది. అందులో భాగంగా హళ్లి కెర లో జరుగుతున్న జాబితా సవరణ కార్యక్రమాన్ని తాసిల్దార్ హరి కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనర్హులను జాబితా నుండి తొలగించాలని, అర్హులైన వారిని జాబితాలో చేర్చాలని, బోగస్ ఓటర్లను తొలగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరి చంద్రశేఖర రావు, వీఆర తదితరులు పాల్గొన్నారు.



ఓటర్ జాబితా సవరణ పరిశీలిస్తున్న తహసీల్దార్

## వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



నరేష్ ఫైల్ ఫోటో

**గుత్తి, జులై 9, ప్రభాతవార్త**

గుత్తి పట్టణంలోని సాయిబాబా టాకీస్ వద్ద నివాసముండే నల్లబోతుల నరేష్ 38 అనే వ్యక్తి అదృశ్యమైనట్లు భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈనెల 3న ఇంటి నుండి బయటకు వెళ్లిన వ్యక్తి తిరిగి రాలేదు. తెలిసినవారు, బంధువుల దగ్గర విచారణ చేసిన ఫలితం కన రాలేదు. దీంతో పోలీసులు ను ఆశ్రయించారు. ఇతని ఆచూకీ తెలిసినవారు సీఐ సెల్ నెంబర్ 9346010582, ఎస్సై సెల్ నంబర్ 9346917082 కు సమాచారం ఇవ్వాలని ఎస్సై సురేష్ బాబు తెలిపారు.

## రైలు నుండి పడి ప్రయాణికుడు కి తీవ్ర గాయాలు



వ్యక్తి గాయపడిన దృశ్యం

**గుత్తి, జులై 9, ప్రభాతవార్త**

తిరుపతి నుండి కర్నూలుకు రైలులో ప్రయాణిస్తున్న చంద్రశేఖర్ అనే ప్రయాణికుడు ప్రమాదవశాత్తు రైలు నుండి కింద పడి తీవ్రంగా గాయాల పాలయ్యాడు. కర్నూలుకు చెందిన ఇతను స్థానిక ఎంపీడీవో కార్యాలయం సమీపంలో రైలు నుండి కింద పడ్డాడు. స్థానికంగా చికిత్స అనంతరం అతని పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూల్ తరలించారు. ఈ సంఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నిందితులకు జైలు శిక్ష

**గుత్తి, జులై 9, ప్రభాతవార్త**

పొలం వ్యవహారంలో దాడులకు పాల్పడిన నిందితుల నేరం రుజువు కావటంతో జైలు శిక్ష విధిస్తూ స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కాశీ విశ్వనాథ చారి తీర్పు వెల్లడించారు. వివరాలు ఇలా ఉన్నాయి. 2014 వ సంవత్సరం మే నెలలో 21న తాడిపత్రి రూరల్ మండలం కోమలి గ్రామంలో పొలం వ్యవహారంలో మల్లేశ్వరి, రంగారెడ్డి, పురుషోత్తం రెడ్డి, జయలక్ష్మి లపై అదే గ్రామంలో నివాసముంటున్న శివారెడ్డి, నరసింహారెడ్డి, నాగార్జున రెడ్డి, నారాయణరెడ్డి, సూర్యనారాయణ రెడ్డి లు కర్రెలు, కొడవళ్ళు తో దాడికి పాల్పడ్డారు.. ఈ మేరకు తాడిపత్రి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు.. నిందితుల నేరం రుజువు కావటంతో ముద్దాయిలకు 2 సంవత్సరముల జైలు శిక్ష, మరియు 10 వేల రూపాయలు జరిమానా విధిస్తూ జడ్జి తీర్పులో పేర్కొన్నారు.. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ పరమేశ్వర్ రెడ్డి కేసు వాదించారు.

## వన్నూరుస్వామి పీర్ల చావిడి వద్ద పెద్ద ఎత్తున అన్నదానం

### మొహరం అనంతరం కొనసాగుతూ వస్తున్న సంప్రదాయం

**ఉరవకొండ, జూలై 9 ప్రభాతవార్త**



వన్నూరు స్వామి పీర్ల చావిడిలో జరిగిన ప్రత్యేక చదివింపుల దృశ్యం



వందలాదిమంది భక్తులకు కొనసాగుతున్న అన్నదానం దృశ్యం

ఉరవకొండ పట్టణంలోని 12వ వార్డు గాంధీ బజార్ ప్రాంతంలోగల వన్నూరు స్వామి (గురికాల వారి) పీర్ల చావిడి వద్ద గురువారం రాత్రి భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం కొనసాగింది. మొహరం పండుగ వేడుకలు అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం అనవాయితీగా వస్తున్న విషయం తెలిసిందే. రాత్రి పీర్లచావిడిలో పీర్లకు ప్రత్యేక చదివింపులు, ప్రార్థనల అనంతరం అన్నదాన కార్యక్రమం ప్రారంభం కాగా రాత్రి పొద్దుపోయే వరకు ఏకధాటిగా కొనసాగింది. స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించడానికి వందలాది మంది భక్తులు పోటీ పడ్డారు.

## ఘనంగా డిస్టిక్ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 73వ సర్వసభ్య సమావేశము



చర్చి నిర్మాణానికి ఫాస్టర్‌కు నగదును అందజేస్తున్న దృశ్యం.

**అనంతపురం రూరల్, జులై 09 ప్రభాతవార్త**

అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి పంచాయతీలోని యేసు కృపా మందిరము లో గురువారం ఆ సంఘం అధ్యక్షుడు పాస్టర్ రెడ్డివారి నెహెమ్యా నాగరాజు ఆధ్వర్యంలో 73 వ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ పాస్టర్. పి. మార్కు ప్రార్థనతో ప్రారంభించబడింది. దైవ సేవకులు పాటలు పాడి దేవుని స్తుతించారు. శ్రీమతి అమృత గారు ఆరాధన జరిగించారు. ముఖ్య ప్రసంగీకులు: రెవ. డాక్టర్ కె. వి ఆల్బర్ట్ ఫస్ట్ బాప్టిస్ట్ ఇండిపెండెంట్ చర్చ్ చిక్బల్లాపూర్ దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టినవానిలో విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయననుఅనుగ్రహించెను, మనది ఒక ఆత్మీయ యాత్ర ఈ యాత్రలో పరిశుద్ధాత్మ దేవుని నింపుదల, సహకారముతో మన ప్రతిదిన ప్రయాణం ఉండాలని ప్రయాణపు మార్గంలో శ్రమలు, కష్టాలు, శోధనలు అనేకము ఎదుర్కోవలసి వస్తుందని ఏసుక్రీస్తు ప్రభువు వారు మాత్రమే మార్గమని ఆ మార్గము ద్వారానే మనము ప్రయాణం చేయవలసిన వారమని, ఇది ఇరుకైన ద్వారమని అర్థం చేసుకుంటూ పరిశుద్ధాత్మ సహాయంతో ముందుకు సాగాలని యేసు క్రీస్తు ప్రభువు వారు చెయ్యి పట్టి వెన్ను తట్టి చక్కటి ఆలోచన ఇచ్చి నడిపిస్తాడని బోధించారు. ముఖ్య అతిథి: రెవ. బెంజిమెన్ గాడ్స్ గ్రేస్ మినిస్ట్రీస్ ట్రస్ట్, బెంగళూర్ మాట్లాడుతూ ఏసు క్రీస్తు ప్రభువు వారు మార్కు సువార్త 10 వ అధ్యాయంలో ఇద్దరు వ్యక్తులతో అడిగిన ప్రశ్న గురించి యేసు నేను నీకేమి చేయ గోరుచున్నావని వాని నడుగగా, ఆ గ్రుడ్డివాడుబోధకుడా, నాకు దృష్టి కలుగ జేయుమని, ఆయనతో అనెను. ఇదే ప్రశ్న దేవుడు మనలను అడిగితే ఆత్మీయ నేత్రాలు తెరవబడాలనిప్రార్థించాలని, సంఘ పరిచర్య అభివృద్ధి, ఫలింపు పొందాలని బోధించారు. అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ పాస్టర్. పి. మార్కు , సెక్రటరీ పాస్టర్. జి ఆర్ ఆనంద్ , జాయింట్ సెక్రెటరీ పాస్టర్. వి. మనష్షే , ట్రెజరర్ పాస్టర్. కె. జీవన్ బాబు , ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ పాస్టర్ జాషువా జహంగీర్ , పాస్టర్. శాంత వర్ధన్, పాస్టర్ విజయ్ సింహ, సలహాదారులు పాస్టర్. శ్యాంసన్ నాయక్, పాస్టర్. గిద్యోను, పాస్టర్. వై పి బాబు, పాస్టర్. ప్రకాష్ ఎల్లనూరు. సరళా చంద్రశేఖర్, పాస్టర్. చెల్లా కిషోర్ పాస్టర్. వి. మనష్షే రేమా చర్చ్ కళాకారుల కాలనీ అనంతపురం నిర్మాణం కొరకు రూ. 25,000/ మరియు పాస్టర్ డేవిడ్ రాజు రాగులపాడు వజ్రకరూరు మండలము ఇమ్మానుయేల్ ప్రేయర్ హాల్ నిర్మాణమునకు ఆర్థిక సహాయము రూ. 10,000/ ముఖ్య అతిథుల చేతుల మీదుగా అందజేశారు. పాస్టర్. శ్యాంసన్ నాయక్ , పాస్టర్. వై పి బాబు , ప్రార్థించారు. తదనంతరం అతిథులను మూమెంటో శాలువాతో సత్కరించారు. పాస్టర్ జాషువా జహంగీర్ ప్రార్థించగా రెవ. డాక్టర్ కె. వి ఆల్బర్ట్ ఆశీర్వాద ప్రార్థన చేశారు. ప్రేమ విందుతో కార్యక్రమము ముగించారు.

## అండర్-19 మహిళల క్రికెట్‌లో సత్తా చాటిన జిల్లా క్రీడా కారిణిలు



రికార్డును సాధించిన జిల్లా మహిళా క్రీడా కారులు

**అనంతపురం సిటీ, జులై 9 ప్రభాతవార్త**

ఏసిఏ సౌత్‌జోన్ అండర్-19 మహిళల అంతర్‌జిల్లా క్రికెట్ టోర్నీలో జిల్లా క్రీడా కారిణిలు హ్యాట్రిక్ విజయాన్ని సాధించారు. చిత్తూరు జిల్లాలోని వాయల్పాడులో జరుగుతున్న అండర్-19 క్రికెట్ టోర్నీలో జిల్లా క్రీడా కారిణిలు వరుసగా మూడు మ్యాచ్‌లలోనూ విజయం సాధించి సత్తా చాటారు. చిత్తూరులో జరిగిన మ్యాచ్‌లో 42.2 ఓవర్లలో చిత్తూరు జట్టు 162 పరుగులకు ఆల్ అవుట్ అయింది. అనంతపురం జట్టు 43.4 ఓవర్లలోనే 163 పరుగులు సాధించి విజయాన్ని అందుకుంది. అనంతపురం కెప్టెన్ నేహా 76 పరుగులు సాధించి నాట్ ఔట్‌గా నిలవగా గీతిక 66 పరుగులు చేసి నాట్ ఔట్‌గా నిలిచి రికార్డు పార్ట్‌నర్ షిప్‌ను సాధించారు. జిల్లా జట్టు హ్యాట్రిక్ విజయం సాధించడం పట్ల ఏడిసిఏ కార్యదర్శి యుగంధర్‌రెడ్డి జిల్లా జట్టు సభ్యులను అభినందించారు. ఇదే స్ఫూర్తితో పోరాడి కప్పును సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

## ప్రకృతి వ్యవసాయ విస్తరణకు ప్రత్యేక కార్యాచరణ

**నల్లచెరువు, జులై 9, ప్రభాతవార్త**



విత్తన శుద్ధితో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు,

నల్లచెరువు మండల పరిధిలోని అల్లుగుండు గ్రామపంచాయతీ, బొమ్మిరెడ్డి పల్లి గ్రామంలో రైతు తిరుపాల్ వద్ద 2.00 ఎకరాలలో వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రైతులందరూ ప్రకృతి వ్యవసాయాన్ని అవలంబించి, స్థిరమైన వ్యవసాయం వైపు అడుగులు వేయాలని మండల వ్యవసాయ అధికారి లక్ష్మీ ప్రియ విజ్ఞప్తి చేశారు. సీడ్ ఫెలటైజేషన్ వల్ల ఉపయోగాలను యన్ ఎఫ్ ఎ దామెదరరెడ్డి తెలియజేస్తూ విత్తనాల మొలక శాతం పెరుగుతుందని, మొక్కలు ప్రారంభ దశలో బలంగా ఆరోగ్యంగా ఎదుగుతాయిని. విత్తనాలకు అవసరమైన సూక్ష్మ పోషకాలు జీవ సూక్ష్మజీవులు అందుతాయి. విత్తనాలు సమాన దూరంలో పడటంతో మొక్కల పెరుగుదల ఏకరీతిగా ఉంటుంది. వర్షాభావ పరిస్థితుల్లో కూడా మొలకకు అనుకూల పరిస్థితులు దృఢంగా ఏర్పడతాయి. విత్తనాలు నేలలో సులభంగా స్థిరపడతాయి. పంట దిగుబడి మరియు నాణ్యత మెరుగుపడుతుంది. రసాయన ఎరువుల అవసరం కొంతవరకు తగ్గుతుంది. నేల ఆరోగ్యం మెరుగుపడి ప్రకృతి వ్యవసాయానికి తోడ్పడుతుంది. రైతులకు సాగు ఖర్చు తగ్గి ఆదాయం పెరిగే అవకాశం ఉంటుందన్నారు . ఈ కార్యక్రమంలో వ్యవసాయ, కదిరి డివిజన్ ఇన్చార్జ్ యన్ ఎఫ్ ఎ దామోదర్ రెడ్డి ,వీ ఎహ ఏ గీత, ఎన్ పీ ఈ ఓ వినీత, ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలు పాల్గొన్నారు.



వ్యవసాయ పద్ధతులను వివరిస్తున్న వ్యవసాయ అధికారులు

04ATP09.qxd:04ATP09.qxd 10/07/26 11:23 PM Page 1



# ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజును పరామర్శించిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి



అనంతపురంలో మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజును పరామర్శిస్తున్న పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి

**అనంతపురం క్రైం, జులై 9, (ప్రభాతవార్త)**

రాష్ట్ర యువ నాయకుడు ఐటి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పై తీవ్ర ఆరోపణలు చేసిన వైసిపి మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి వ్యాఖ్యలను పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ఖండించారు. గురువారం వారు అనంతపురంలోని మడకశిర ఎమ్మెల్యే, శ్రీ సత్య సాయి జిల్లా టిడిపి అధ్యక్షులు ఎమ్మెస్ రాజు ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో విమర్శలు ప్రతి విమర్శలు చేసుకోవచ్చు కానీ, రాజకీయాల్లో నైతికవిలువలు హుందాతనం ఎంతో అవసరం అన్నారు. ఇలాంటి వ్యాఖ్యల వల్ల రాజకీయ నేతలపై ప్రజల్లో చులకనా భావం ఏర్పడుతుంది .ఉమ్మడి అనంత జిల్లాలో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ఎంతో మంది రాజకీయ నేతలు మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి తరిమెల నాగిరెడ్డి, జెసి నాగిరెడ్డి లాంటి మేధావులు కలిగిన ఈ జిల్లాలో ఎంతో రాజకీయ విలువలతో పాలన సాగించారు. అలాంటిది ఈనాడు రాజకీయ విలువలు దిగజారే విధంగా వ్యక్తిగత వ్యాఖ్యలు ఆరోపణలు చేసుకోవడం ఎన్నటికీ మంచిది కాదు అన్నారు. అరాచకాలు, అక్రమాలు, దౌర్జన్యాల సంస్కృతి వైసిపిదే అని ఆయన ఆరోపించారు.పెట్టుబడుల రాష్ట్రంగా ఆంధ్ర ప్రదేశ్ ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతోంది.అభివృద్ధి వైపు పరుగులు తీస్తున్న ఏపీలో అల్లర్లు ,అలజడులు సృష్టించాలని వైసీపీ చూస్తే సీఎం చంద్రబాబు చూస్తూ ఊరుకోరు అని ఆయన హెచ్చరించారు.శాంతి భద్రతల విషయంలో ఎవరున్నా ,ఎంతటి వారైనా సీఎం చంద్రబాబు ఎక్కడ రాజీపడరు.ఎస్సీ కులానికి చెందిన టిడిపి ఎమ్మెల్యే పార్టీ టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెస్ రాజు పై అనుచిత వ్యాఖ్యలు సమర్ధనీయం కాదు అని, వైసిపి మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి వ్యాఖ్యలను తాను తీవ్రంగా ఖండిస్తున్నట్లు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథరెడ్డి వెల్లడించారు. రాజకీయ విలువలు కోల్పోయే విధంగా నీచమైన భాషలతో చేసే వ్యాఖ్యలు భవిష్యత్ భావి తరాలకు ఎలాంటి సంకేతాలను ఇస్తుందో వైసీపీ నేతలే సమాధానం చెప్పాలి. ఇప్పటికైనా రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రజల శ్రేయస్సు కోసం వైసీపీ నేతలు పనిచేయాలని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి హితవు పలికారు.

# ఆత్మగౌరవానికి భంగం కలిగించిన తోపుదుర్తిని వదలను..!

**నాకున్నది 4 కాదు 5 పదవులు...5వది పసుపు సైనికుడు**

**అనంతపురం క్రైమ్ జూలై 9 ప్రభాతవార్త**



ఆత్మగౌరవానికి భంగం కలిగించిన తోపుదుర్తి ప్రకాష్ రెడ్డిని వదలనని మడకశిర ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు అన్నారు. తోపుదుర్తి ఎం.ఎస్. రాజుకు రూ.7కోట్ల విల్లా ఉందని, బెంగళూరులో ఆస్తులు ఉన్నాయని, మంత్రి నారా లోకేష్ కి బినామీగా ఉన్నారని చేసిన అసత్య ఆరోపణలపై ఎం.ఎస్.రాజు మండిపడ్డారు. తనపై చేసిన ఆరోపణలను గురువారం సాయంత్రం 5గంటల్లోపు నిరూపించాలని ఎం.ఎస్.రాజు సవాల్ విసిరారు. సవాల్ పై తోపుదుర్తి స్పందించకపోవడంపై ఎం.ఎస్.రాజు ప్రెస్ మీట్ నిర్వహించారు. ప్రకాష్ రెడ్డి వైసీపీలో తన ఉనికిని కాపాడుకునేందుకు లోకేష్ పై, మాపై అసత్య ఆరోపణలు చేశాడన్నారు. మా ఎమ్మెల్యేలు, లోకేష్ పై మాట్లాడిన వారిని వ్యతిరేకించాల్సిన అవసరం జిల్లా పార్టీ అధ్యక్షుడిగా నాపై ఉందన్నారు. మడకశిరలోని పార్టీ ఆఫీస్ స్థలం నాదే అని, బెంగళూరులో నాకు ఆస్తులు ఉన్నాయని, అనంతపురంలో నేను విల్లా కొన్నానని, నేను చెప్పుల షాపులో పనిచేశానని నన్ను కించపరిచేలా మాట్లాడాడన్నారు. నా తమ్ముడికి చెప్పుల షాపు పెట్టిస్తే....దానిని వక్రీకరించాడన్నారు తోపుదుర్తి నాపై చేసిన ప్రతి ఆరోపణను నిరూపించాలని నేను సవాల్ విసిరానన్నారు. తోపుదుర్తి ఇంత దిగజారి రాజకీయాలు చేయడం దుర్మార్గం. నీ మాదిరి దందాలు, దౌర్జన్యాలు, దాడులు, హత్యలు చేసినట్లు ఎక్కడైనా రుజువు ఉందా? అన్నారు. చక్రపాణిని విజయవాడలో గాంధీ బజారులో కోట్లు విలువ చేసే స్థలం కోసం నలుగురు హత్య చేశారు. ఆ కేసులో నిందితుడు తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి. ఆ రక్తపు కూడు విలువ రూ.100కోట్లు. విజయవాడ రైల్వే స్టేషన్ సమీపంలో ఈ ఆస్తి ఉంది. ఈ నిందితుల్లో ఒకతన్ని కూడా తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి చంపించారన్నారు. కోట్లు విలువ చేసే ఒక భవనాన్ని తోపుదుర్తి రక్తపు మరకలతో కట్టుకున్నది కదా? హత్యలు, దౌర్జన్యాలు, భూకబ్జాలు చేసే నీచ సంస్కృతి ఉన్న తోపుదుర్తి నన్ను విమర్శించడం ఏంటన్నారు.అమ్మ డైరీ పేరుతో మహిళలను మోసం చేయలేదా అన్నారు. వాల్మీకు ల భూములను బెదిరించి, తక్కువ రేటుకు నువ్వు దోచుకోలేదా? వందల కోట్లు పోగేసుకోలేదా? 2019లో ఇల్లు లేదు అని చెప్పిన తోపుదుర్తికి నేడు కోట్లాది రూపాయల ఆస్తులు ఎక్కడినుండి వచ్చాయన్నారు. నీ ఆస్తుల ఖరీదుపై నా ఆస్తుల ఖరీదుపైన ఓపెన్ డిబేట్‌కి సిద్ధమా? అన్నారు.

# ఉద్భవలక్ష్మి ఆలయంలో శాస్త్రోక్తంగా మహా సంప్రోక్షణ

**ఉరవకొండ, జూలై 9 ప్రభాతవార్త**



ఉద్భవలక్ష్మి అమ్మవారికి మూలవిరాట్‌ను శుద్ధి నిర్వహిస్తున్న దృశ్యం

మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళం లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఉప ఆలయమైన ఉద్భవలక్ష్మి ఆలయంలో బుధవారం సాయంత్రం మహా సంప్రోక్షణ కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయంలో బుధవారం తెల్లవారుజామున చోరీ జరిగిన విషయం తెలిసిందే. ఈక్రమంలోనే ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ రేగటి నాగరాజు, కార్యనిర్వహణ అధికారి సాకే రమేష్‌బాబు ఆధ్వర్యంలో అర్చకులు ఏ.ఎన్.ద్వారకనాధాచార్యులు, ఎం.బాలాజీ బృందం ఆగమ శాస్త్రం ప్రకారం ఆలయ శుద్ధి నిర్వహించి అమ్మవారికి తిరుమంజనం, మహా స్థాపన, హోమం, అమ్మవారి మూలవిరాట్‌కు విశేష అభిషేకాలు, ఇత్యాది క్రతువులును, అమ్మవారికి నిత్య కైంకర్యాలు, పూజలు నిర్వహించారు. ఆలయ పవిత్రతకు భంగం కలుగకుండా వివిధ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా పూర్తీచేసి భక్తులకు అమ్మవారి దర్శనాన్ని పునరుద్ధరించారు.

# ప్రపంచ జనాభా దినోత్సవ పోస్టర్లు ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్



ప్రపంచ జనాభా దినోత్సవం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, సంబంధిత అధికారులు

**పుట్టపర్తి,జూలై 9, ప్రభాతవార్త**

శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ కార్యాలయం నందు ప్రపంచ జనాభా దినోత్సవం (వరల్డ్ పాపులేషన్ డే) సందర్భంగా ప్రత్యేక పోస్టర్లను జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆవిష్కరించారు. ఈ నెల 11వ తేదీన జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో, జిల్లా కలెక్టరేట్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాల యాలలో ప్రపంచ జనాభా దినోత్సవ కార్యక్రమాలను విధిగా నిర్వహించాలని ఆదేశించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ నిర్దేశించిన "పిల్లల మధ్య ఎడమ (వ్యత్యాసం), ఆరోగ్యకరమైన, ఆనందకరమైన కుటుంబానికి ఆధారం, "పిల్లల మధ్య ఎడమ పాటిద్దాం, ఆరోగ్యవంతమైన సంతోషకరమైన కుటుంబాన్ని నిర్మిద్దాం" అనే ముఖ్యమైన స్లోగన్స్ ప్రజల్లోకి బలంగా వెళ్లేలా కార్యక్రమాలను చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఈ నెల 11వ తేదీన జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో తప్పనిసరిగా అవగాహన ర్యాలీలు నిర్వహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ క్యాంపెయిన్‌లో భాగంగా, ఉత్తమ ప్రతిభ కనబరిచిన వైద్య ఆరోగ్య సిబ్బందికి వారి పనితీరు ఆధారంగా క్యాడర్ వారీగా నగదు ప్రోత్సాహకాలు, బహుమతులు అందించడం జ . వైద్య ఆరోగ్య సిబ్బంది అంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, భవిష్యత్తులో శ్రీ సత్యసాయి జిల్లాను రాష్ట్రస్థాయిలోనే ముందంజలో ఉంచాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అధికారులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఫైరోజా బేగం, డి సి హెచ్ ఎస్ డాక్టర్ మధుసూదన్, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీదేవి, స్టాటిస్టీషియన్ కళాధర్, డిపిఎమ్ఓ నాగరాజు, డిపిహెచ్ఎన్ఓ వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# నారా లోకేష్‌పై ఆరోపణలు చేసిన ప్రకాష్ రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలి

**- ఎమ్మెల్యే సురేంద్రబాబు - చౌకబారు విమర్శలు చేస్తే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని వ్యాఖ్య**



మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజుతో సమాలోచనలు జరుపుతున్న కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు.

**కళ్యాణదుర్గం, జూలై 9 ప్రభాతవార్త**

రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌పై వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి చేసిన ఆరోపణలను కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తీవ్రంగా ఖండించారు. మడకశిర ఎమ్మెల్యే, శ్రీ సత్యసాయి జిల్లా టీడీపీ అధ్యక్షుడు, టీటీడీ బోర్డు సభ్యుడు ఎమ్మెస్ రాజుపై ప్రకాష్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా చేపట్టిన కార్యక్రమం నేపథ్యంలో గురువారం ఎమ్మెస్ రాజు నివాసానికి వెళ్లిన సురేంద్రబాబు ఆయనతో సమావేశమై ప్రస్తుత రాజకీయ పరిణామాలపై సమాలోచనలు జరిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సురేంద్రబాబు మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో రాజకీయ విమర్శలు సహజమే అయినప్పటికీ వ్యక్తిగత దూషణలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు, కులాలను కించపరిచే వ్యాఖ్యలు చేయడం రాజకీయ విలువలకు విరుద్ధమని అన్నారు. రాజకీయాల్లో నైతిక విలువలను పాటించకుండా వ్యవహరించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో గతంలో రాజకీయ నాయకులు విలువలు, హుందాతనంతో రాజకీయాలు చేశారని, ప్రస్తుతం వ్యక్తిగత విమర్శలు, కుల దూషణలు, అరాచక రాజకీయాలకు కొందరు పాల్పడుతున్నారని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం శాంతి భద్రతలకు ప్రాధాన్యత ఇస్తుంటే, వైఎస్సార్‌సీపీ నాయకులు రౌడీయిజం, ఫ్యాక్షన్ సంస్కృతిని ప్రోత్సహించేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఎస్సీ వర్గానికి చెందిన మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని, భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతం అయితే చట్ట పరిధిలో చర్యలు తప్పవని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు హెచ్చరించారు. ప్రజలను తప్పుదోవ పట్టించే చౌకబారు రాజకీయాలు మానుకోవాలని, అలాంటి రాజకీయాలకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి కూడా పాల్గొన్నారు.

# గృహ నిర్మాణ పథకం అమలులో శ్రీ సత్యసాయి జిల్లాకు అగ్రస్థానం

**లక్ష్యాలను వేగంగా పూర్తి చేయండి : హౌసింగ్ మేనేజింగ్ డైరెక్టర్ అరుణ్ బాబు**



సమీక్ష సమావేశంలో పాల్గొన్న హౌసింగ్ ఎండి అరుణ్ బాబు, జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లు





హాజరైన సంబంధిత అధికారులు

**శ్రీ సత్యసాయి జిల్లా, జూలై 09, ప్రభాతవార్త ప్రతినిధి**

గృహ నిర్మాణ పథకం అమలులో రాష్ట్రంలోనే శ్రీ సత్యసాయి జిల్లా అగ్రస్థానంలో నిలిచిందని హౌసింగ్ మేనేజింగ్ డైరెక్టర్ అరుణ్ బాబు తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లాలో చేపట్టిన వివిధ గృహ నిర్మాణ పథకాల ప్రగతిపై గురువారం హౌసింగ్ మేనేజింగ్ డైరెక్టర్ అరుణ్ బాబు, జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తో కలిసి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండి అరుణ్ బాబు మాట్లాడుతూ, పేదలందరికీ ఇళ్లు నిర్మించి ఇవ్వాలనే ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా అధికారులు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలన్నారు. శ్రీ సత్యసాయి జిల్లాలో గృహ నిర్మాణ పథకాలకు సంబంధించి ప్రజల్లో ఉన్న సానుకూలత జూన్ నెలలో 93.56 కి పెరిగి, రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలవడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. మే నెలతో పోలిస్తే సానుకూలతలో 23.59 స్పష్టమైన ప్రగతి కనిపించిందని, ఇదే ఉత్సాహంతో పనులను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 57,889 ఇళ్లను మంజూరు చేయగా, ఇప్పటివరకు 28,639 గృహాల నిర్మాణాలు విజయవంతంగా పూర్తయ్యాయనీ, మిగిలిన 29,250 ఇళ్ల పనులను వివిధ దశల్లో వేగంగా ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. ఇందుకోసం జిల్లాలో ఇప్పటివరకు రూ. 700.07 కోట్ల నిధులు ఖర్చు చేయడం జరిగింది. జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ, లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం సకాలంలో అందేలా ఎప్పటికప్పుడు ఎఫ్ టి ఓ లు జనరేట్ చేస్తున్నామని, హౌసింగ్ అధికారులతో నిరంతరం సమీక్షిస్తూ శ్రీ సత్యసాయి జిల్లాను గృహ నిర్మాణంలో రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిపేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న లేఅవుట్లు, ఇళ్ల నిర్మాణాలను ఎక్కడికక్కడ క్షేత్రస్థాయి పరిశీలనలు జరిపి, లబ్ధిదారులను ప్రోత్సహించి పనులు పూర్తయ్యేలా చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో హౌసింగ్ పిడి వెంకట నారాయణ, హౌసింగ్ విభాగపు ఉన్నతాధికారులు, ఇంజనీరింగ్ సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# హత్యాయత్నం కేసులో రెండు సంవత్సరాలు జైలు శిక్ష మరియు జరిమానా

**తాడిపత్రి అర్బన్ జూలై 9 ప్రభాతవార్త**



నిందితులను చూపుతున్న పోలీసులు

తాడిపత్రి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కోమలి గ్రామంలో 12 సంవత్సరాల క్రితం జరిగిన దాడి కేసులో 05 మంది ముద్దాయిలకు 2 సంవత్సరాలు జైలు శిక్ష, ఒక్కొక్కరికి పదివేల రూపాయలు జరిమానా విధిస్తూ గుత్తి కోర్టు జడ్జి తీర్పు చెప్పారని రూరల్ సీఐ శివగంగాధర్ రెడ్డి పేర్కొన్నారు..తాడిపత్రి రూరల్ మండలం కోమలి గ్రామం లో 2014 మే 21వ తేదీ రాత్రి ఛాయమ్మ గారి శివారెడ్డి ,ఛాయమ్మ గారి నరసింహారెడ్డి, ఛాయమ్మ నాగార్జున రెడ్డి,ఛాయమ్మ గారి నారాయణరెడ్డి,ఛాయమ్మ గారి సూర్యనారాయణ రెడ్డి కలిసి అదే గ్రామంలో నివాసమున్న మల్లేశ్వరి, ఆమె భర్త రంగారెడ్డి, ఆమె బావ పురుషోత్తం రెడ్డి, ఆయన భార్య జయ లక్ష్మి లపై పొలం విషయంలో కట్టలు కొడవళ్లతో దాడి చేసి గాయపరచినారని ,మల్లేశ్వరి ఫిర్యాదు మేరకు మేరకు అప్పటి తాడిపత్రి రూరల్ పోలీస్ స్టేషన్ లో ట్రైనీ ఐపీఎస్ అధికారి శ్వేత తాడిపత్రి రూరల్ పోలీస్ స్టేషన్ కేసు నమోదు చేసి విచారణ చేసి ముద్దాయిలను అరెస్టు చేసి రిమాండ్ పంపినారు. ఎస్సైగా పనిచేస్తున్న నారాయణరెడ్డి ముద్దాయిలపై, గుత్తి కోర్టు నందు చార్జిషీటు దాఖలు చేశారు.గుత్తి కోర్టు కేసును విచారణ జరిపి ఈ కేసులో 14 మంది సాక్షులను విచారించి నేరం రుజువైనందున అనంతపురం జిల్లా గుత్తి జడ్జి కాశీ విశ్వనాద ఆచారి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ఈ కేసులో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం. పరమేశ్వర్ రెడ్డి గారు ప్రాసిక్యూషన్ తరఫున వాదనలు వినిపించారు.

# ఇంగ్లాండ్ టోర్నీకి ఎంపికైన సాత్విక్ చౌదరి

**- అభినందించిన మాంఛూ ఫెర్రర్**

**అనంతపురం సిటీ, జులై 9 ప్రభాతవార్త**



సాత్విక్ చౌదరిని అభినందిస్తున్న మాంఛూ ఫెర్రర్

ఇంగ్లాండ్‌లో జరగనున్న ఎక్స్‌పోజర్ టూర్‌కు జిల్లాకు చెందిన సాత్విక్ చౌదరి ఎంపిక కావడం పట్ల ఆర్డిటి ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛూ ఫెర్రర్ అతనిని అభినందించారు. జిల్లాకు చెందిన సాత్విక్ చౌదరి ఇంగ్లాండ్‌లో ఈ నెల 11 నుంచి 24 వరకు జరగనున్న ఎక్స్‌పోజర్ టూర్‌కు ఎంపికయ్యారు. జిల్లాకు చెందిన సాత్విక్ చౌదరి అండర్-19 జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించి అంతర్ జిల్లా మ్యాచ్‌లలో 7 వికెట్లు సాధించి అంతర్ జోనల్ పోటీల కోసం ఆంధ్ర-సౌత్ జోన్ అండర్-19 జట్టుకు ఎంపికై తన ప్రతిభను కనబర్చడంతో ఇంగ్లాండ్‌లోని మాంచెస్టర్‌లో జరగనున్న 3 టీ-20 మ్యాచ్‌లు, 7 వండే మ్యాచ్‌లలో ఆడనున్నారు. ఈ సందర్భంగా సాత్విక్ చౌదరిని ఆర్డిటి ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛూ ఫెర్రర్, ఏడిసిఏ అధ్యక్షులు శ్రీనాథ్, ఆర్డిటి స్పోర్ట్స్ డైరెక్టర్ సాయి కృష్ణ, ఏడిసిఏ కార్యదర్శి యుగంధర్‌రెడ్డిలు అభినందించారు.

# ఎస్ఐఆర్ సర్వే వేగవంతంగా పూర్తి చేయాలి

**అసిస్టెంట్ కలెక్టర్ సుయాస్ కుమార్**



అధికారులకు సూచనలు చేస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ సుయాస్ కుమార్

**గార్లదిన్నె, జులై 09,ప్రభాత వార్త**

గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామంలో గురువారం అనంతపురం జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ సుయాస్ కుమార్, ఐఏఎస్ పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో జరుగుతున్న ఎస్ఐఆర్ (సర్ ) సర్వే పురోగతిని పరిశీలించి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. సర్వేను వేగవంతంగా పూర్తి చేసి, అర్హుల వివరాలను కచ్చితత్వంతో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. సర్వే ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు.

# సమాజంలో అశాంతిని సృష్టించే వారిని తరిమి కొట్టాలి : ఎమ్మెల్యే కాలవ



పాట్టాపాస్‌బుక్ అందజేస్తున్న ఎమ్మెల్యే

**రాయదుర్గం జూలై 9 ప్రభాతవార్త**

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ సమాజంలో అశాంతి సృష్టించేందుకు ప్రయత్నించే వారిని ప్రజలే తరిమి కొట్టాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. గుమ్మఘట్ట మండలం బేలోడు గ్రామంలో గురువారం నిర్వహించిన పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నప్పటికీ, వైసీపీ నాయకులు ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. సమాజంలో ప్రశాంత వాతావరణాన్ని దెబ్బతీసే కుట్రపూరిత శక్తులకు వారు అండగా నిలుస్తున్నారని ఆగ్రహం వ్యక్తపరిచారు. వైకాపా అధినేత జగన్మోహన్ రెడ్డి తో పాటు ఆపార్టీ నాయకులు పదేపదే అధికార పార్టీ నేతలపై బురద చల్లుతూ దుష్ప్రచారానికి పాల్పడుతున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో పాటు హిందూ దేవతలు, సంప్రదాయాలపై కూడా అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సంఘవిద్రోహ శక్తులకు వత్తాసు పలికే ఇలాంటి నేతలకు తగిన బుద్ధి చెప్పకపోతే మళ్లీ మళ్లీ నిరాధారమైన ఆరోపణలను చేస్తూనే ఉంటారని తెలియజేశారు. అధికారంలో ఉన్న తాము ఏదైనా చేస్తే... అధికారాన్ని అడ్డుపెట్టుకొని చేశారని అబాండాలు వేస్తారన్నారు. అదే ప్రజలు ఒకసారి తిరగబడితే మళ్లీ మన జోలికి రారని సూచించారు. ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేసే వారికి మీరే తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ప్రజల ఆదరణ, ఆశీస్సులే కూటమి ప్రభుత్వానికి అతిపెద్ద బలమని, ప్రజల మద్దతు ఉన్నంతకాలం రాష్ట్ర అభివృద్ధిని ఏ శక్తి అడ్డుకోలేదని స్పష్టం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీ అభ్యర్థులను అన్ని స్థానాల్లో అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. రైతుల హక్కులను హరించే విధంగా వైకాపా ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అనే చీకటి చట్టాన్ని చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేయడం జరిగిందన్నారు. భూ యజమానికి తన సొంత పొలంపై సర్వ హక్కులు కల్పిస్తూ మరింత బలోపేతం చేసే ఉద్దేశంతో రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రైతుల ఫోటోతో పాటు రాజముద్ర కలిగిన ఈ పాస్‌పుస్తకాలు భూ యాజమాన్యానికి మరింత భరోసా కల్పిస్తాయని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కాలువ సన్నన్న, యూనిట్ ఇంఛార్జి బేలోడు సంజీవ, మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్ ధానవేంద్ర, కెపి దొడ్డి నాగరాజు,మాజీ మండల పార్టీ అధ్యక్షుడు కురుబ గిరిమల్లప్ప, తాళ్లకేర వెంకటేశులు, మాజీ సర్పంచ్ నాగరాజు, సత్యనారాయణ,కాలువ నాగరాజు,రాము, రాజు తదితరులు పాల్గొన్నారు.

# వేగం పుంజుకున్న ఈఎఫ్‌ల డిజిటలైజేషన్ ప్రక్రియ

**-నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి వి.మల్లికార్జునరెడ్డి**

**ఉరవకొండ, జూలై 9 ప్రభాతవార్త**





ఉరవకొండ-149 అసెంబ్లీ నియోజకవర్గంలో సర్-2026లో భాగంగా ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, డిజిటలైజేషన్ ప్రక్రియ వేగం పుంజుకుంది. నియోజకవర్గంలోని 260 పోలింగ్ స్టేషన్ల పరిధిలో 2,26,187 మంది ఓటర్లు ఉండగా 2,23,947 మందికి ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేసి అందులో 1,70,414 మంది ఓటర్ల ఎన్యుమరేషన్ ఫారాలను సేకరించి డిజిటలైజేష్ (75.34శాతం) పూర్తీ చేయడం జరిగిందని నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి వి.మల్లికార్జునరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని విడపనకల్లు మండలంలోని 50 పీఎస్‌ల పరిధిలో 44,808 మంది ఓటర్లకుగాను 44,680 మందికి ఈఎఫ్‌లు పంపిణీ చేసి పూరించిన 34,843 ఈఎఫ్‌లను డిజిటలైజ్ చేయడం జరిగిందన్నారు. వజ్రకరూరు మండలంలో 51 పీఎస్‌ల పరిధిలో 43,902 మంది ఓటర్లకుగాను 43,505 ఈఎఫ్‌లను పంపిణీ చేసి 33,232 ఈఎఫ్‌లను డిజిటలైజ్ చేయడం జరిగిందన్నారు. ఉరవకొండ మండలంలోని 80 పీఎస్‌ల పరిధిలో 68,356 మంది ఓటర్లకుగాను 66,652 మందికి ఈఎఫ్‌లు పంపిణీ చేసి 49,673 ఈఎఫ్‌లను, బెలుగుప్ప మండలంలోని 42 పీఎస్‌ల పరిధిలోని 36,682 మంది ఓటర్లకుగాను 36,680 మందికి ఈఎఫ్‌లు పంపిణీచేసి 27,951 ఈఎఫ్‌లను, కూడేరు మండలంలోని 37 పీఎస్‌ల పరిధిలోని 32,439 మంది ఓటర్లకుగాను 32,430 మందికి ఈఎఫ్‌లు పంపిణీచేసి 24,715 మంది ఓటర్ల ఈఎఫ్‌లను డిజిటలైజేషన్ చేయడం జరిగిందని ఆయన వివరించారు.

# దుష్ప్రచారం మానుకుని ప్రజా సమస్యలపై దృష్టి పెట్టండి

**వైసీపీ నేతలకు ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు సూచన.**



మాట్లాడుతున్న కాలవ శ్రీనివాసులు

**అనంతపురం, జూలై 9, (ప్రభాతవార్త బ్యూరో)**

వైసీపీ నాయకులు నిరాధార ఆరోపణలు, వ్యక్తిగత దూషణలు మానుకుని ప్రజల కష్టసుఖాలపై దృష్టి సారించాలని ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సూచించారు. అనంతపురంలో ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజు నివాసంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ కోసం మంత్రి నారా లోకేష్ జాతీయ, అంతర్జాతీయ వేదికలపై నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న పెట్టుబడి అవకాశాలను ప్రపంచానికి పరిచయం చేస్తూ అభివృద్ధికి బాటలు వేస్తున్న నాయకుడిపై వైసీపీ నేతలు అసత్య ప్రచారం చేయడం బాధాకరమన్నారు. ఆయన ఎదుగుదలను చూసి ఓర్వలేని నేతలు పదేపదే నిరాధార ఆరోపణలు చేస్తూ... ప్రజలను నమ్మించాలన్న భ్రమలో ఉన్నారన్నారు. కానీ ప్రజలు వాస్తవాలను బాగా గుర్తిస్తున్నారని చెప్పారు. రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి వాహనానికి చిన్న ప్రమాదం జరిగితే దానికి రాజకీయ రంగు పులిమి లబ్ధి పొందాలనుకోవడం దురదృష్టకరమన్నారు. అధికార పార్టీ నేతలపై హత్యాయత్నం ఆరోపణలు చేయడం బాధ్యతా రాహిత్యమని విమర్శించారు. ఈ ఘటనపై వాస్తవాలను వెల్లడించిన ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజుపై వ్యక్తిగత దూషణలకు దిగడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. రాష్ట్రంలో రైతులు అనేక కష్టాలను ఎదుర్కొంటున్నారని కాలవ పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో రైతులకు అండగా నిలవాల్సిన ప్రతిపక్షం ప్రజా సమస్యలను పక్కనపెట్టి అధికార పక్షంపై దూషణలతో కాలయాపన చేస్తుండటం శోచనీయమన్నారు. ప్రభుత్వానికి నిర్మాణాత్మక సూచనలు, సలహాలు ఉంటే ఇవ్వాలి కానీ అవమానకర వ్యాఖ్యలు, వ్యక్తిగత దూషణలు చేయడం మానుకోవాలని సూచించారు. బలహీన వర్గాలకు చెందిన నాయకులపై దురహంకారపూర్వక వ్యాఖ్యలు చేయడం ఆ వర్గాల ప్రజల మనోభావాలను దెబ్బతీస్తాయన్నారు. వైసీపీ నాయకులు ఈ విషయాన్ని గుర్తించి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కాలవ శ్రీనివాసులు సూచించారు.